
# తెలుగువాణి

28వ వార్షిక సంచిక



నవంబర్ 2018 తెలుగు సాంస్కృతిక సంఘం, ఆస్టిన్ Vol. 28 No.1

# With Best Compliments From






# తెలుగువాణి

## 28వ వార్షిక సంచిక

Vol. 28 No. 1

సంపాదకవర్గం :

**ఉమ్మా వెంకటరామిరెడ్డి**

**రామ హనుమంత మల్లిరెడ్డి**

ముఖచిత్రం :

**ఉమ్మా వెంకటరామిరెడ్డి**

website : www.austintelugu.org
facebook : https://www.facebook.com/teluguculturalassociationaustin

Telugu Cultural Association, Austin

తెలుగు సాంస్కృతిక సంఘం, ఆస్టిన్

మీరు మెచ్చిన, మీకు నచ్చిన సాంస్కృతిక సంఘం - సభ్యులుగా చేరండి, చేర్పించండి

# LEADERSHIP TEAM



**Venkatram Reddy Vumma**
President



**Ram H Malli Reddy**
Secretary



**Brahmendra Lakku**
Treasurer



**Srinivasa Battula**
Cultural & Event Management



**Shruthi Karnati**
Membership & Technology



**Rajkishan Chintakindi**
Finance & Sponsorship



**Kedarnath Mundluru**
Logistics & Food



**Sangameshwar ReddyGari**
Board of Director



**Ravi Burujula**
Board of Director



**Venkat Shiva Namala**
Board of Director

# సంపాదకీయం

దేశ భాషలందు తెలుగు లెస్స, ఇది అందరికీ తెలిసిన నానుడి. కాని ప్రస్తుత అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అధికంగా మాట్లాడే విదేశీ భాషగా తెలుగు ప్రథమ స్థానంలోకి చేరింది. ఈ సంవత్సరము సెప్టెంబర్ నెలలో **Centre for immigration studies (CIS)** సర్వే లెక్కల ప్రకారం అమెరికాలో తెలుగు మాట్లాడే ప్రజల సంఖ్య నాలుగు లక్షలకు చేరి ఇతర విదేశీ భాషలను అధికమించి ప్రథమ స్థానంలో నిలబడడం మనకందరికీ ఎంతో గర్వకారణం. ఇక మనము ప్రపంచ భాషలందు తెలుగు లెస్స అనడం అతిశయోక్తి కాదేమో? ఈ స్ఫూర్తితో ఈ తెలుగువాణి పత్రికను తీర్చిదిద్దడానికి ప్రయత్నము జరిగింది. అమెరికాలో తెలుగుభాషకు ఈ గౌరవం దక్కడంలో ఎంతోమంది భాషాభిమానుల కృషి వుంది. వారు అన్ని రాష్ట్రాలలో వివిధ రూపాలలో మన భాషాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వీరందరికీ నా వినయపూర్వక నమస్కారాలతో ఈ సంచికను వారికి అంకితం చేస్తున్నాను.

తెలుగువాణి సంపాదకవర్గము మరియు తెలుగు సాంస్కృతిక సంఘం కార్యవర్గము తరపున మీకందరికీ దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు. ఈ సంచిక ప్రచురణకు సహకరించిన 'టెక్సస్ సాహిత్య వేదిక' సమూహ నిర్వాహకులకు మరియు సభ్యులకు నా కృతజ్ఞతలు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది భాషాభిమానులు వారి కవితలు, వ్యాసాలు చక్కని కథలను పంపడం జరిగింది. వారందరికీ నా ధన్యవాదములు తెలుపుకుంటున్నాను. ఈ ప్రచురణలో ఏమైనా భాషాదోషాలు, తప్పులు దొర్లితే పెద్ద మనసుతో మన్నించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.



మీ భవదీయుడు

**ఉమ్మా వెంకటరామిరెడ్డి**

# విషయసూచిక


1. అధ్యక్షుడి సందేశం ........ 5
2. ప్రకృతి ప్రవచనము; మాతృ ప్రపంచకం ........ 6
3. యాద్గిరిగాని ముచ్చట్లు - 1 ........ 7
4. తేట తెలుగు భాష - తేనెలొలుకు భాష ........ 9
5. వీడుకోలు.... వేడుకోలు ........ 10
6. హిందూ వివాహ వ్యవస్థ ........ 11
7. ఎమరుపాటున ........ 14
8. స్వయం ప్రతిభ ........ 15
9. ఓ శకం ముగిసింది.... ఓ కమలం వాడింది ........ 17
10. ప్రదక్షిణానికొక పద్యం ........ 18
11. భిన్నత్వంలో ఏకత్వం ........ 20
12. తెరచిన పుస్తకం ........ 23
13. యాద్గిరిగాని ముచ్చట్లు - 2; మంచిమాటలు ........ 24
14. సత్యమేది? అసత్యమేది? ........ 25
15. సంస్కారం ........ 26
16. ప్రగతిపథం ........ 27
17. భక్తి - మానవత్వం ........ 28
18. కలికాల మహిమ ........ 30
19. భారతీయ సంస్కృతి ........ 31
20. వైకుంఠపాళీ ........ 32
21. గరిక ........ 34
22. TCA చిత్రాలు ........ 35

# అధ్యక్షుడి సందేశం

ఆస్టిన్ తెలుగు ప్రజలకు మరియు ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం కుటుంబసభ్యులందరికీ నా హృదయపూర్వక నమస్కారములు. గత ఐదు సంవత్సరములుగా ఈ సంఘంలో వివిధ బాధ్యతలు నిర్వహించడానికి అవకాశం ఇచ్చి సహకరించిన ఆస్టిన్ తెలుగు ప్రజలందరికీ, పూర్వ మరియు ప్రస్తుత కార్యవర్గసభ్యులకు నా కృతజ్ఞతలు.

సంస్థ అధ్యక్షునిగా ఈ సంవత్సరం ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. వినూత్నంగా అంతర్జాలాన్ని ఉపయోగిస్తూ వివిధ రకాలైన సెమినార్లను ఇమిగ్రేషన్, ట్యాక్స్ సూచనలు చేయడం జరిగింది. దీనితో సంఘానికి మరియు తెలుగు ప్రజలకు ఎంతో సమయాన్ని, ధనాన్ని ఆదా చేయడం జరిగింది. అదేవిధంగా స్థానిక దేవాలయాల సహకారంతో మన పండుగలైన సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి, బతుకమ్మ, దసరా మరియు దీపావళి పండుగలు ఘనంగా చేసుకోవడం జరిగింది.

ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా వేడుకలుగా చేయడం, అలాగే సంవత్సరం పొడవునా వివిధ పోటీ క్రీడలైన వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, చదరంగం, మహిళలకు త్రో బాల్ విజయవంతంగా నిర్వహించాము. అలాగే ఆపదలో ఉన్న స్థానిక తెలుగువారికి సహాయక నిధిని ఏర్పాటుచేసి, వారికి ఆ సమయంలో తోడుగా నిలవడం జరిగింది. అదేవిధంగా వివిధ స్వచ్ఛంద సంస్థలకు సంఘం తరపున వారికి కావలసిన ధన సహాయం చేయడంలో సహకరించడం మరియు వారితో కలసి పనిచేయడం జరిగింది.

చివరిగా భావితరాలకు మన సంస్కృతి మరియు సంప్రదాయాలను అందజేయడానికి ఈ సంవత్సరపు కార్యవర్గం తరపున మీ అందరి సహాయ సహకారాలను కోరుతూ ఈ అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు మరొకసారి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.



మీ విధేయుడు

**ఉమ్మా వెంకటరామిరెడ్డి**

అధ్యక్షుడు, తెలుగు సాంస్కృతిక సంఘం 2018

# ప్రకృతి ప్రవచనము

– ఆచార్య డా॥ ప్రభాకర్ రెడ్డి పల్లెర్ల

మంచిని మదించి మలుచు మంచికి మరీ మరీ
ఓరిమిని ఒదిమి అద్దు ఓరిమికి ఓర్చి ఓర్చి
నవ్వును నవ్వించి పంచు నవ్వుకు నవ్వి నవ్వి
ప్రభవ ప్రవాహమున ప్రకృతి ప్రవచనము

మితి మీరిన పోకడలు కత్తెరలో పోకడలు
మతి తప్పిన తాత్సారములు తిప్పలేని తప్పిదములు
మితయుత యుక్తులు ముక్తయుత ముదావహములు
ప్రభవ ప్రవాహమున ప్రకృతి ప్రవచనము

బతుకు ఈ రోజు బతుకు రీతిగ
బతుకు నిండా నింపాదిగా బతికినట్టే
బతుకు బతుకమ్మ స్ఫూర్తిగ బతుకుయెల్ల
ప్రభవ ప్రవాహమున ప్రకృతి ప్రవచనము

పట్టిన దానిని పట్టనట్టు సడలించనేల
పట్టులాగ పరిష్టమును పరి పుష్టి గావించు
పట్టుదలయే పరమపద పరమానంద సోపానము
ప్రభవ ప్రవాహమున ప్రకృతి ప్రవచనము ✦

# మాతృ ప్రపంచకం

– రాంభట్ల వేంకటరాయ శర్మ

కం. నవమాసంబులు మోసి ప్ర
సవించి శిశువును, బహువిధ శ్రమలన్ బడుచున్
ప్రవిమల ప్రేమను బంచుచు
నవిరళముగ సాకునట్టి, అమ్మకు జేజే! (1)

కం. ఉంగా యుంగా యనుచును
లుంగలు పడి పొర్లిదొర్లి రోదించంగా!
చెంగున నొడి చేర్చుచు, నా
బంగరుకొండా యటంచు పాలున్ గుడుపున్! (2)

కం. బుడిబుడి యడుగులు వేయుచు
తడబడగా చేయి పట్టి తాలిమి తోడన్
నడకను నేర్పుచు, నాపై
నడతను సరిదిద్దు నమ్మకమ్మయె సరిరా! (3)

కం. రూపసి యైనన్, బిడ్డ కు
రూపయినన్, మాతృ ప్రేమ రూఢిక నొకటే!
పాపము పుణ్యము నెంచక
తాపత్రయపడును తల్లి తనయుల కొరకే! (4)

కం. అమ్మను మించిన దైవం
బిమ్మహి లేదనుచు తెలిసి, హేలగ కొలువన్
నెమ్మనమున, వేరే పు
ణ్యమ్ముల మరి చేయనేల? నరజన్మంబున్! (5) ✦


KP Indian Grocery

KP IndianGrocery

1212W Parmer Ln, Austin, TX 78727

Phone : 512-833-6222

# యాద్గిరిగాని ముచ్చట్లు

1

– ఎస్.వి. ప్రసాద్

ఏమయ్యా యాదగిరి, ఏంటి విశేషాలు? ఏమట్లా దిగులుగా కనిపిస్తున్నావు, ఏమయ్యింది?

ఏముంటది సార్, గీ సద్వురాని పకీర్గాని జిన్దగిల. గియ్యాల ఇంటిగ్గిట్ల ఫోన్జేసిన. నా పెండ్లం పరేషాన్ జేస్తున్నది సార్, గేందిన్నే పైసలవంపిస్తున్నవని. సార్ నాకీడ టొంబై దినార్లు ఇస్తడు మా అర్బాబ్. గంటె తొమ్మిదివెయిల చిల్లరన్కొరాదూ. గా పైసలల్ల నేను ఈడ బువ్వ తినాలె మల్ల ఫోనుగ్గిట్ల ఐదారు దినార్లు గావలె. మీకెర్కనె గదా సార్ గీడన్నీ సామాన్లు ఎంత పిరమున్నయి. నాకొక్క దురలవాటు లేదు సార్, గీ ఒక్క తంబాకు దప్ప. గదిట్కెన్ని పైసల్గావాలె సార్. ఒక్క దినార్వెడ్తె రెండు మూడు నెలల తంబాకు దొర్కతది. గప్పట్కి పైలి పైలికి నల్బై యాబై దినార్లు వంపుతుంటి, గంటె నెలకి నాలుగైదు వెయిల రూపయలన్కొ రాదు. గాఅన్ని పైసల్గిట్ల మనదేశమ్ల దొరికితే గీడికెందుకొస్త సారూ పెండ్లం పిల్లలను ఇడ్సిపెట్టి. మీరె జెప్పండి సార్ గంతకంటె గీ పకీర్గాడు ఏం పంప్తడు ఇంట్కి.

పదియేను సమత్సరాల్కెంచి గీడనే వుంటున్న నేను. ఏంజెయ్యాలె సార్, మా వూర్ల కోమ్టాయన తాన లక్షా ఇర్వై వెయిల అప్పు జేసిన ఇల్లు గట్టెటప్పుడు. గెన్ని పైసలిచ్చినా మిత్తికే సాల్తలేదు, గింక అసలెప్పుడు తీర్వాలె. మా వూర్ల ఒకాయ్న దుబై వొయినుండె. ఒక్కసారి గాయ్న వొచ్చినుండె దుబై కెంచి. గాయ్న మా దోస్తొకన్కి జిగిరన్నట్లు. మా దోస్తొక్క దినం తొల్కవొయిండు ఆ దుబైవాని కాడ్కి. ఆడు జెప్పిండు దుబైల గిట్ల మస్తు పైసలిస్తరని. ఆయ్ననే బొంబైల ఒక ఎజెన్సి ఫోన్ నంబర్ అడ్రెస్ గిట్ల ఇచ్చిండు.

నేన్గిట్ల గా ఎజెన్సి కెంచి ట్రైజేసిన దుబైల ఏమైన పని దొరుక్తదేమో అని. గా ఎజెన్సోడు నీకు బహ్రయిన్ల పని ఇప్పిస్త, గంద్కె నల్బై వెయిల రూపాయల్గావలె అనిజెప్పిండు. నేను జెప్పిన నాకు దుబైలోనె పనిగావాల్నని. గాడు నాక్జెప్పిండు ఫికర్వడద్ది, బహ్రయిన్ దుబైకి గా పక్క పొంటె ఉంటదని, గాడ మస్తు తెలుగోల్లు ఉన్నరని. ఏం జెయ్యాలె పైసల్గావల్నంటె దైర్నం జెయ్యాలె. గా కోమ్టాయన తాన మల్ల నల్బై వెయిల రూపాయలు దీస్కున్న. గట్ల ఈడికొచ్చిన సారూ.

ఏమున్నది సార్ నా అసొంటోని జిన్దగిల, పదియేను సమత్సరాలల్ల ఐదు సార్లు ఇంట్కివొయిన. మా అర్బాబ్ మూడు సమత్సరాలకొక్కసారి టికెట్ ఇస్తడు ఇంట్కివోనికి. మా ఇంట్ల చుట్టంలెక్క జూస్తున్రు నన్ను. ఇంట్కివోతె నా పెండ్లంగిట్ల దగ్గెరకు రాదు. ఏదో తల నొస్తున్నది, పానం బాగలేదు అన్జెప్తది. నాకిద్దరు మొగ పొలగాన్లు, ఒక ఆడ విడ్డె. ఆడ విడ్డెనె పెద్దన్నట్లు. ఆయ్మెకు పెండ్లి జేసిన. పెద్దయ్న పదో తరగతయ్నంక కాలెజ్కి వోతున్డు. చిన్నయ్న ఆరో తర్గతి సద్వుతున్నడు.

దేశానికివోతే నా పెండ్లం నువ్వెప్పుడ్వోతవ్ బహ్రయిన్కి అని అడుగ్తది. గంటె నేనవసరమే లేదయ్మెకి. పెద్ద పోరడు నాయ్న నాకు మోటర్ సైకిల్ గావాలె, మొబైల్ ఫోన్ గావాలె అని అడ్గతడు. ఏంది సార్ నాకొచ్చె జీతమ్ల గివన్ని యాడికెంచి అయితయ్ సార్. పోని అయ్న మంచిగ సద్వుతడాంటె గదీ లేకపాయె. అర్రె, మమ్లను మంచిగ సాకనికి మా నయ్న ఎంత కష్ట పడ్తున్నడు, పెండ్లం బిడ్డల్బి దగ్గెర లేకుండ ఎన్ని కష్టాలు వడ్తున్నడో అని ఆలోచన చెయ్యకపాయె. చిన్నయ్న ఒక్కాయ్నె చాన మంచి పోరడు, వానికి మంచి తెలివున్నది మస్తు సద్వుతడు. అయ్నేంజేస్తడో ఎర్కలేదు.

యాష్టకొస్తున్నది సార్. ఇంకేమున్నది, అంత అయ్పాయె. గందర్కి నేను వంపె పైసల్గావాలె, నేనెవ్వల్కీ అవసరమ్లేదు. కట్టుకున్న పెండ్లమ్కె ఫికర్ లేకపాయె. ఒక్క దినం గాయబైత, యాడ్కయినా పారిపోత సారూ ఎవ్వల్కి చెప్పకున్టా.

PS : కుటుంబ బాంధవ్యాలను త్యాగం చేసుకుని పరాయిదేశాలలో అష్టకష్టాలుపడుతూ వేలాది కోట్ల డాలర్లను ఇంటికి పంపి భారత దేశాన్ని సుసంపన్నంచేస్తున్న యాదగిరి, అలాంటి మరెన్నో ప్రవాస భారతీయులకు జోహార్లర్పిస్తూ నా శెలవు. ✦

# RAM KONARA

REALTOR - (469) 964-2033

*With Best Compliments from*



## NARAYANAREDDY FAMILY

# తేట తెలుగు భాష - తేనెలొలుకు భాష

- ఆచార్య డా॥ ప్రభాకర్ రెడ్డి పల్లెర్ల

మా తెలుగు భాష
యాభై ఆరు అక్షర సమూహ
అచ్చు హల్లుల సాహిత
ఒత్తు గుణింత సమాహారమాల
నలంకరించి
అంద చందములనద్దిన మా భాష
మా తేట తెలుగు భాష
సమాలోచనములేవైనా
సంభాషణమేదైనా
సుస్పష్టతను సమకూర్చిన భాష
తెలంగాణమునకే తలమానిక
మణిహారము మా తెలుగు భాష
మమకార మకరంద మధుర భాష
దేశ భాషలందు తెలుగు లెస్స భాష
మదిమదిన మెదలాడిన మమైక భాష
కవి పుంగవులను పుట్టించిన భాష
తెలంగాణ గడ్డను పులకింపజేసి
పునీతమైన మా తెలుగుభాష
తరములెన్ని మారినా
తలరాతలేవేవో కాలక్రమము
నిగ్గుతేల్చినా
చరిత్ర పుటలనెన్నింటినో
తిరగేసి చూసినా
కనులారా కానవచ్చే భాష
కనువిందు గావించే మా తెలుగు భాష
సంబురాల సంరంభ సమాహార భాష
సమాలోచన సమన్వయ
సంయమన భాష
నిండుకుండ నింపాది
నిష్కామకర్మ భాష
నిక్కనిగూఢ నిర్మాత మా తెలుగు భాష
పూదోట అంతరంగపు భాష
మధురిమ దుందుభి భాష
నిరాడంబర అంబరాన్నంటిన భాష
ప్రతి నోటా ప్రతి క్షణము పలికే భాష
ప్రతిబింబముగ ప్రజ్వరిల్లే భాష
తెలంగాణ నట్టింట నాట్యమాడే భాష
నటరాజ నర్తన నయన భాష
ప్రజా రంజన భంజనము గావించే
మా తెలుగు భాష
యెన్నెన్నియని గొంతులెత్తి పాడుదుము
నీ సరాగ గానము గురించి
మా మది నిండా మనోరంజనము
నింపిన మా మధుర తెలుగు భాష
మా తేట తెల్లపు తెలుగు భాషకు
మన తెలంగాణ బిడ్డల నమస్సులు
ప్రపంచ తెలుగు మహాసభ సంబురాల
శుభాభివందన సాష్టాంగ
నమస్సుమాంజలులు

NALA'S
Taste Of South India

# వీడుకోలు ... వేడుకోలు

- వెంకట వడ్డమాను

కాలగర్భంలో కరిగిపోతున్న హేవిళంబికి వీడుకోలు
కాలగమనంలో మరో మజిలీ విళంబి లోకోత్తరంగా ఉండాలని వేడుకోలు

మరో ఉగాది ... ఎన్ని ఉగాదులు గడిచినా ఏమున్నది గర్వ కారణం ?
మానవ చరిత్ర యథాతథం చర్విత చర్వణం

మనసులో నిరాశా మేఘాలు ఆవరించిన
ఉవ్వెత్తున ఎగసిన అంతరంగ తరంగాలివి

ఏం సాధించామని ఈ ఉగాదికి స్వాగతం చెబుదాం
అహంకారం మీద మమకారాన్ని చంపలేకపోయాం
ఈర్ష్య, ద్వేషాసూయలపై విజయాన్ని సాధించలేకపోయాం

అసత్యం, అవినీతి, పరస్పర నిందారోపణలే జీవనాధారమైన
ఏలికలు, ప్రతిపక్షాలు - ఇదే ప్రజాస్వామ్యమైతే ఈ వ్యవస్థ మాకొద్దు

నిర్భాగ్యులు, నిస్సహాయులు, నిర్వీర్యులు, నిస్తేజులైన పాలికుల
బలవన్మరణాలకు చలించని ఏలికలు - ఇదే ప్రజాస్వామ్యమైతే ఈ వ్యవస్థ మాకొద్దు

తళుకు బెళుకు కాంతులీను తారలు ప్రజాస్వామ్య తోరణాలు కావాలని
తహతహలాడుచున్న వేళ

మన పయనమెటు ? మన గమ్యమెటు ?

మన అంతశ్శత్రువులపై విజయం సాధించిననాడే నిజమైన ఉషస్సు, నిజమైన ఉగాది
అలాంటి నవ్య, దివ్య, భవ్య ఉషస్సుకు ఈ విళంబిలోనే స్వాగతం పలుకగలమని ఆశిద్దాం ✦

Eye Level
Learning Center
MATH + ENGLISH
with CRITICAL THINKING curriculum

Austin • Avery Ranch • Cedar Park • Round Rock

'Excel in School; Succeed in Life!'

Phone: (512) 336-0743, (512) 666-9673
Fax: (512) 367-5999
Email: info@eyelevelaustin.com
Website: www.EyeLevelAustin.com



# హిందూవివాహవ్యవస్థ

– గంగుల శ్రీహరి

చతురాశ్రమధర్మాలలో గృహస్తాశ్రమాన్ని స్వీకరించడానికి హిందూధర్మం నిర్దేశించిన క్రతువే వివాహం. యుక్తవయసు వచ్చిన స్త్రీ పురుషుల్లో ప్రకృతిసహజంగా కలిగే కామం విశృంఖలత్వం చెందకుండా ధర్మంతో ముడివేసి వారిని ధార్మిక జీవనంలో నిలబెట్టడానికి వేల సంవత్సరాల క్రితమే సనాతనధర్మం ఏర్పాటు చేసిన వ్యవస్థ. ఓ తల్లికి జన్మించిన బిడ్డ నుంచి ఆ తల్లి మాతృత్వాన్ని విడదీయడం ఎంత అసాధ్యమో, హిందూ ధర్మంలో ఒకసారి వివాహబంధంతో ఒక్కటైన వధూవరుల బంధాన్ని విడదీయడం అంతే అసాధ్యం. అందుకే విడాకులు అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు హిందూధర్మం.

ప్రతీ ఆడపిల్లని లక్ష్మీ స్వరూపంగా చూస్తుంది హిందూ సంస్కృతి. యుక్తవయసు వచ్చేవరకూ తన ఇంట పెరిగిన లక్ష్మీ స్వరూపాన్ని నారాయణ స్వరూపుడైన వరుని దగ్గరకి చేర్చడమే వధువు తండ్రికి ప్రధాన బాధ్యత. అందుకే వారిలోకి లక్ష్మీ నారాయణులను ఆవాహనచేసి, విష్ణుస్వరూపుడైన వరుడి కాళ్ళు కడిగి ఆ నీళ్ళు తలపై చల్లుకుంటాడు కన్యాదాత.

**కన్యాదాత :** "సర్వాలంకారశోభిత, సాధ్వి, సుశీల అయిన ఈ కన్యను ధర్మ, అర్థ, కామాలనే పురుషార్థాల సిద్ధి కొరకు సుశీలుడు, బుద్ధిమంతుడు అగువానికి దానంచేయుచున్నాను". "సత్సంతానము పొందుటకు, ధర్మకర్మలను ఆచరించుటకు నీకు నియమించుచున్నాను. కావున ఈమెను వరించవలసినది." అంటాడు వరుడితో.

**వరుడు :** "వరించుచున్నాను. కన్యనిచ్చిన దాతకు, స్వీకరించిన నాకు బాంధవ్యము కలుగుగాక!" అంటాడు.

**కన్యాదాత :** "ధర్మ అర్థ కామములలో ఈమెను అతిక్రమించకు" అంటే

**వరుడు :** "అతిక్రమించను" అంటాడు.

ఏ దానం చేసినా "నేను నీకు ఇచ్చుచున్నాను. ఇక ఇది నాదికాదు" అని అంటారు. కాని, కన్యాదానము చేసినప్పుడు మాత్రం "ఇది నాదికాదు" అనరు. అంటే అత్యంత అవసరమయిన సమయాలలో వధువు సంరక్షణా బాధ్యతలను తీసుకునే హక్కుని ఎప్పుడూ కలిగిఉంటాడు కన్యాదాత. "నా పెళ్ళాం నా ఇష్టం" లాంటివాటిని అనుమతించదు హిందూధర్మం.

ఇలాంటి సత్సంకల్పంతో కన్యాదానంచేసి, తర్వాత వారి కాపురంలో తలదూర్చి, తమ కుమార్తెకు అర్థంపర్థంలేని సూచనలు చేస్తూ వారి కాపురాన్ని అస్తవ్యస్తంచేసే తల్లిదండ్రులు నేటిసమాజంలో కోకొల్లలు. "భర్తను కొంగునముడేసుకో" లాంటి పనికిమాలిన విషయాలను బోధించడం ఎంత అజ్ఞానమో అలాంటి తల్లిదండ్రులు గుర్తెరగాలి.

వివాహ సుముహూర్తానికి వస్తే, వధూవరులు ఒకరికళ్ళలోకి ఒకరు సూటిగా చూసుకోవడమే సుముహూర్తం. ఆ వెంటనే జీలకర్ర, బెల్లం కలిపిన మిశ్రమాన్ని ఒకరికొకరు తలపై బ్రహ్మరంధ్రాన్ని తాకేలా ఉంచుకోవాలి. తద్వారా ఒకరి జీవరసాలు మరొకరిలోకి ప్రవేశిస్తాయి. కాని నేటి వివాహాలలో సుముహూర్తం అంటే తలపై జీలకర్ర బెల్లంపెట్టి వీడియో వంక చూడటం. అలాంటి వివాహాలకి ముహూర్తబలం, శాస్త్రీయత అనేవి నేతిబీరకాయలోని నేతిచందమే అవుతుందని గ్రహించాలి.

ఆడపిల్ల పుట్టగానే ఆమె పోషణ బాధ్యతని చంద్రుడు, రెండున్నర సంవత్సరాలతర్వాత గంధర్వుడు, 8 సంవత్సరాల తర్వాత అగ్ని తీసుకుంటారని చెబుతుంది శాస్త్రం. తన సంరక్షణలో ఉన్న వధువును వరుడు స్వీకరిస్తున్నాడు కాబట్టి ఆ వివాహానికి అగ్నియే సాక్షి. అదే అగ్నిసాక్షిగా వివాహమాడటం.

ఇక పాణిగ్రహణంలో వరుడు ఈ మంత్రం చదువుతూ వధువు చేతిని పట్టుకుంటాడు : "ఓ వధువా! నేను నీ చేతిని మంచి సంతానం కోసం పట్టుకుంటున్నాను. నీవూ నేనూ కలిసి ఇక రాబోయే సంవత్సరాలన్నీ జీవించాలి. ముసలితనాన్ని కూడా నీతోనే గడుపుతాను. భగ, ఆర్యమ దేవతలు, ఇంద్రుడు గృహస్తాశ్రమ ధర్మాలను నిర్వహించమని నిన్ను నాకు ఇచ్చారు. ఆ దేవతల అనుగ్రహంతో నీవు నాకు లభించావు".

సప్తపది మంత్రాలతో ఒక్కటయ్యే వధూవరులు ఇలా ప్రమాణాలు చేసుకుంటారు.

**వరుడు :** "నాతో ఏడడుగులు నడిచి నాకు మంచి స్నేహితురాలవు కమ్ము. మనిద్దరం ఏడడుగులు నడిస్తే మంచి స్నేహితులమవుతాం. అప్పుడూనేను నీ స్నేహాన్ని పొందుతాను. నీ స్నేహం నుంచి ఎప్పుడూ విడిపోను. నీవూ నా సఖ్యత నుండి విడిపోకు. మనం కలసిమెలసి పరస్పర ప్రేమతో, అనుకూల దాంపత్యంతో ప్రకాశిస్తూ, మంచి మనస్సు కలిగి, ఒకరినొకరు గౌరవించుకుంటూ, మంచి ఆహారాన్ని ఇద్దరం కలిసితిందాం. బలాన్ని పొందుతూ ఇద్దరం కలిసి ఉందాం. కలిసి ఆలోచించు కుందాం. కలిసి నిర్ణయించుకుందాం. కలిసి నడుచుకుందాం. బాహ్యేంద్రియాల విషయంలో కూడా కలిసి ఉండేటట్లు నడుచుకుందాం."

**వధువు :** "నీవు పొరపాటు లేకుండా ఉండు. నేను కూడా ఏ పొరపాటు రాకుండా చూసుకుంటాను. నీవు ఆకాశానివి. నేను భూమిని. నీవు శుక్రధాతువు. నేను శుక్రాన్ని ధరిస్తాను. నీవు మనసువు. నేను వాక్యాన్ని."

భార్యాభర్తల సమానత్వం, స్నేహం, పరస్పర గౌరవం అనే విషయాలకి హిందూ వివాహంలో ఎంత ప్రాముఖ్యతనిచ్చారో ఈ మంత్రాలను చూస్తే అర్థమవుతుంది. ఆధునిక పోకడలుగా నేడు చెలామణీ అవుతున్న ఈ విషయాలు అనాదికాలంలోనే సనాతన ధర్మం ప్రతిపాదించింది. శాస్త్రం చెప్పినట్టు నడుచుకోవడం అంటే భార్య భర్తకి అనిగిమణిగి ఉండటం, సేవలుచేయడం అనీ, స్త్రీని వివాహం పేరుతో భర్త చెప్పుచెతల్లోపెట్టి అణచివేతకు గురిచేయడమే హిందూ వివాహమని అపోహపడే నేటి నారీమణులు ఒకటికి పదిసార్లు చదవాల్సిన మంత్రార్థాలు ఇవి. వీటి అర్థాలు తెలియక, తమ మూర్ఖత్వంతో భార్యని హింసించే కొంతమంది పురుష పుంగవులను చూసి దాన్ని వ్యవస్థకి ఆపాదించడం అవివేకమే అవుతుంది.

ఇకవివాహానికి, మొదటిరాత్రికి మధ్య వధూవరులు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడడానికి కొంత సమయం ఉండాలి అనే అభిప్రాయం కూడా కొత్తదేమీకాదు. గంధర్వస్థాపనం అనేపేరుతో మూడురోజుల సమయాన్ని దీనికి కేటాయించింది హిందూవివాహం. అనగా మూడురాత్రులు భార్యాభర్తలు ఉప్పుకారం లేని భోజనంచేస్తూ, తియ్యని పదార్థాలు తింటూ, బ్రహ్మచర్యమును అవలంభించి, నేలపై పడుకోవాలి. ఒకేపాత్రలో భోజనంచేసి, ఒకేశయ్యపై పడుకోవాలి. మేడికొమ్మకు దర్భలుచుట్టి, అలంకారంచేసి, దానియందు గంధర్వుడిని ఆవాహనచేసి, ఇద్దరి మధ్య దీనిని ఉంచి పడుకోవాలి. మూడురోజులూ ఇద్దరికి ఒకేవస్త్రం (ఇద్దరి వస్త్రాలు కొంగుముడివేస్తే అది ఒకే వస్త్రమవుతుంది), ఒకే శయ్య, ఒకే పాత్రలో భోజనం ఉండాలి. కలిసిఉంటూ, ఒకే శయ్యపై పడుకుంటూ కూడా బ్రహ్మచర్యం పాటించడం వధూవరుల నిగ్రహశక్తికి పరీక్ష. నాలుగవరోజు రాత్రి గంధర్వునికి ఉద్వాసనచెప్పి, వరుడు కన్యను తనకి ఇచ్చినందుకు అగ్నికి, గంధర్వునికి, సోమునికి (చంద్రుడు) కృతజ్ఞతలు చెప్పుకుంటాడు.

ఆ తర్వాత వివాహంలో ఆఖరిదైన శేష హెూమంలో వధువు : "నిన్ను నా అభిప్రాయములు తెలిసినవానివిగానూ, మంచి సంస్కారముతో పుట్టినవానివిగానూ, మంచి నియమాలతో పెంచుకున్న తేజస్సు గలవానివిగానూ నేను గ్రహించాను. ఓ సంతానాభిలాషీ! నీవు నాలోనే సంతానాన్ని కని, సిరిసంపదలనిచ్చి సుఖపడుము." అంటుంది. తర్వాత ఇద్దరు : "విశ్వేదేవతలు, పవిత్రజలాలు, వాయువు, బ్రహ్మమనమనస్సులను స్నేహంతో కూడునట్లు చేయుదురుగాక! సరస్వతి మనమెప్పుడూ అనుకూలముగా మాట్లాడుకొనునట్లు చూచుగాక! " అని ప్రార్థిస్తారు.

ఇలా వివరించుకుంటూపోతే హిందూ వివాహక్రతువు ఓ పెద్ద పుస్తకమే అవుతుంది. కొన్ని ముఖ్యమైన సందర్భాలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. వివాహ సాంప్రదాయాన్ని పూర్తిగా తెలుసుకుంటే, హిందూ వివాహం ఎంత గంభీరమైనదో, అది యజ్ఞ సమానమైన క్రతువుగా ఎందుకు కొనియాడబడుతుందో పూర్తిగా అర్థమవుతుంది. ✦

## మంచిమాటలు

**ఓడిపోవడం అంటే నీకేమీ రాదని కాదు.**
**నేర్చుకోవలసింది ఇంకా ఉందని అర్థం.**

**ఒకరి మెప్పు కోసం ఇంకొకరికి ముప్పు తలపెట్టకు**
**చుట్టూ తిరిగి ఆ నిప్పు నీ తలకే చుట్టుకుంటుంది**

**ఆరు అంగుళాల నాలుకను అదుపులో ఉంచుకోకపోతే**
**ఆరడుగుల శరీరం ఇబ్బందులకు గురవుతుంది**

# La Frontera Dental, PLLC

Cosmetic and Family Dentistry

***La Frontera Dental, where your confidence matters***

## *Dr. Satish Thirumalai, D.M.D.*



Our mission is to protect the dental health of our patients through prompt diagnosis and treatment of oral diseases. Our services in dentistry include preventative, corrective, cosmetic dentistry including Implants, Invisalign and wide range of other procedures.

Dr. Satish and his skilled team are committed to provide exemplary dental care and will provide individual attention and personalized care. We take care of all your family dental needs using modern technology to provide you a pain free and pleasant dental experience. Please call to make an appointment.

Located at:
2711 La Frontera Blvd, Ste 270., Round Rock, TX 78626

**www.lafronteradental.com**

**512-358-1215**

# ఎమరుపాటున

– ఆచార్య డా॥ ప్రభాకర్ రెడ్డి పల్లెర్ల

ఎవరేమిటి ఎమరుపాటున
ఎవరెందుకు ఎదురు మోమున

ఎవరి జాలి లెందుకు జారున
ఎవరి దాక్షిణ్యము లేల దారిన

ఎవరికెఱుక ఎపుడు ఏమి జరుగునో
ఎరుకలేని దాని గురించి ఏకరువులేల

ఏకాకి కకావికలు కవలించి వికళించు
ఏకైక ఐక్యములే ఐక్యమొందు ఎమరుపాటున

ఎదురు చూపులేల ఎరగని దానికి
ఎదుర ఉన్నది ఎదురుకో ఎమరుపాటున

ఏదేమిటని ఎలా ఎరుగుదువు
ఏరువాక ఏరులను ఏర్పరుచు ఎమరుపాటున

ఎదలోకి ఎగిరి గంతులేయి
ఎదగవోయి ఎక్కి ఎక్కి ఎమరుపాటున

ఎవరిలోనో లేదు ఎదో ఎరిగేది
ఎదలోన ఎరుగు ఎగిరి ఎమరుపాటున ✦


NEW YORK LIFE

PRAKASH VERMA

Agent, New York Life Insurance Company



- Life Insurance
- College funding
- Retirement
- Lifetime income strategies

Ph : (512) 731 - 4010
pverma@ft.newyorklife.com

New York Life Insurance Company
6200 BRIDGEPOINT PARKWAY, #300
AUSTIN, TX 78730-5106

కథ

# స్వయం ప్రతిభ

- రాంభట్ల వేంకటరాయశర్మ

మణిపుర రాజ్యాన్ని విక్రమవర్మ పరిపాలిస్తున్నాడు.... ప్రజలను కన్నబిడ్డలకన్నా ఎక్కువగా చూసుకుంటున్నాడనే పేరు... రాజుకు వేటకు వెళ్లడం అలవాటు... మణిపుర రాజ్యం, మహా ఘోర అడవుల మధ్యన ఉండటంతో శత్రు దుర్భేద్యమయిన రాజ్యంగా ప్రసిద్ధి... ఆ చుట్టుపక్కల రాజ్యాలలో విక్రమవర్మను మించిన విలుకాడు లేడని ప్రజలనుకునేవారు.... ఇదిలా ఉండగా, ఒకనాడు, రాజు కొంతమంది పరివారం వెంటతీసుకొని, వేట నిమిత్తం, రాజ్యానికి కొంత దూరంలో ఉన్న అడవికి వెళ్లాడు.... వేట ధ్యాసలో పడి, పరివారం నుండి విడివడి, దారితప్పి, మహా దట్టమైన అడవిలోకి వెళ్లిపోయాడు.... కాసేపటికి, ఒకజింక పిల్ల, ఎవరో వేటాడటానికి తరుముకొస్తున్నట్లుగా, తనవైపుగా వస్తుండగా, ఒక పదునైన బాణం లేడికి తగిలింది.... గొప్ప విలుకాడైన రాజుకు, ఆ బాణాన్ని పరీక్షగా చూసి, తనకన్నా గొప్ప విలుకాడు వేసిన బాణంగా గ్రహించాడు.. చుట్టుపక్కల రాజ్యాలలో ఎవరికీ ఇంతటి విలువిద్యాపాండిత్యం లేదుకదా... మరి ఈ బాణం వేసిన అంతటివారెవరబ్బా అని, ఆ బాణం వచ్చిన వైపు ఆత్రంగా చూస్తున్న రాజు దగ్గరకు ఓ కిరాతుడు వచ్చి నిలబడ్డాడు. రాజు ముందుగా ఆశ్చర్యపడినా, అంతలోనే తేరుకునేలోగా, ఆ జింకపిల్లను ఒక్క ఉదుటన ఎత్తి భుజం మీద వేసుకుని వెళ్లిపోతున్న కిరాతుని చూశాడు... తనకన్నా గొప్ప విలుకాడైన అతన్ని, తన రాజ్యానికి సేనానిగా నియమిస్తే, భద్రంగా ఉంటుందని ఆలోచించిన రాజు, అతని దగ్గరకు వెళ్లి, తన మనసులోని తలపు చెప్పాడు... నువ్వు, నీ భార్య మా రాజ్యంలో స్వేచ్ఛగా ఉండవచ్చునని రాజు చెప్పాడు. కాసేపు ఆలోచించి, సరేనన్నాడా కిరాతుడు.... అడవిలో అన్ని దారులు తెలిసిన అతను, రాజును పదిలంగా, తమ పరివారానికి అప్పగించాడు..

కిరాతున్ని, సైనానిగా నియమిస్తున్నట్లుగా, ప్రకటించాడు రాజు. కాలం గడుస్తున్నకొద్దీ రాచరికపు అలవాట్లకు, అలవాటుబడ్డాడు కిరాతుడు... రాజు ఎంత చనువిచ్చినా, తన హద్దుల్లో తానుండేవాడు. కొంతకాలానికి, విక్రముడికి ఒక కొడుకు పుట్టాడు.. అలాగే కిరాతునికి కూడా కొడుకు పుట్టాడు... వారి ఆనందానికి అవధుల్లేవు... రాజకుమార, కిరాత కుమారులు పెరిగి పెద్దవారవుతున్నారు... రాజకుమారుణ్ణి అతిగారాబంగా చూసుకుంటున్నాడు రాజు.. కిరాతుడు మాత్రం తానెలా పెరిగాడో అలాగే స్వతఃసిద్ధంగా పెంచుతున్నాడు. వారిద్దరికీ, తనకు తెలిసిన విలువిద్యా రహస్యాలన్నింటిని మర్మం లేకుండా, సమానంగా నేర్పిస్తున్నాడు కిరాతుడు... అయితే అన్ని విద్యల్లోనూ, రాజ కుమారుడికన్నా, కిరాత కుమారుడే ముందుంటున్నాడు.... ఏకసంతాగ్రాహ్యత్వం వలన చెప్పిన వెంటనే అన్నింటినీ నేర్చుకుంటున్నాడు... కానీ రాజకుమారుడికి పదేపదే చెబుతున్నా ఒంటబట్టడంలేదావిద్యలు.... తన తర్వాత రాజ్యానికి మహారాజు అవవలసినవాడు, అన్ని విద్యలతో బాటు, విలువిద్యలోనూ ప్రావీణ్యం సంపాదించటమే కాదు, తనకొడుకు తనకన్నా గొప్ప విలుకాడు కావలని, విక్రముడు ఆలోచిస్తూ ఉండేవాడు.... కానీ రోజురోజుకి ఈ ఆలోచన పెరిగి మనోవ్యధగా మారింది.... ఇది, రాజు ఆలోచనా విధానాన్నే మార్చేసింది... కిరాతుడు, తన కొడుక్కే అన్ని నేర్పించి, రాజకుమారిడికి ఏమీ నేర్పడంలేదనే స్థితికి రాజు చేరుకున్నాడు... ఇవేమీ తెలియని కిరాత సేనాని, తనుమాత్రం రాజ్యానికి, రాజుకు కట్టుబడి, సమాన ధర్మంతోనే నేర్పుతున్నాడు.... ఇంకెవరైనా, గొప్ప విలువిద్యా గురువులు ఉన్నారేమో చూడండని, మంత్రికి ఆదేశమిచ్చాడు రాజు... చిత్తం మహాప్రభూ అని అన్ని రాజ్యాలను గాలించారు.... కానీ ఎక్కడా కూడా, ఇతనికి మించిన

గురువు లేరని తెలియజేశారు... రాజు మనోవ్యధ అంతకంతకు ఎక్కువవ్వడం గమనించిన మంత్రి, రాజగురువుకు విషయం చెప్పాడు.... రాజగురువుకు పరిస్థితి అర్థమైంది... ఒకరోజు ఉదయాన్నే, రాజు అంతఃపురంలో ఉండగా, రాజగురువు వెళ్లాడు. రాజా! చింతింపకు... ఏ గురువు కూడా ఒకరినెక్కువగా, ఒకరిని తక్కువగా చూడడు.. విద్యార్థిలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభకు, గురువు చెప్పే విద్య తోడైనప్పుడే ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దబడతారు... స్వతహాగా కిరాతుని కొడుకు గనుక, ఏదైనా తొందరగా నేర్చుకోగల ప్రతిభ అతనికి జన్మతః అబ్బింది... దానికి విద్య మరింత సొబగును కూర్చింది... అయితే, రాజపుత్రుడనే కారణంతో నీ కొడుకును గారాబంగా పెంచే దారిలో, అతనిలోని ప్రతిభను తెలుసుకోలేకపోయావు... ఏదైనా రంగంలో కొంత ప్రతిభ ఉంటే, దానికి కృషి తోడైతే రాణింపు ఉంటుంది... అంతేగానీ, ప్రతిభ లేనిచోట ఎన్ని నేర్పినా, వాసన లేని కృతిమ పువ్వుల ఛందంగానే ఉంటారు తప్పా, భాసించలేరని, వివరించి చెప్పాడు రాజగురువు.... ఆ మాటలకు రాజుకు జ్ఞానోదయ మైంది... పిల్లల్లో ఏ రంగంలో ప్రతిభ ఉందో గుర్తించీ, అందులో ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాడు... అదే సమయంలో, తనకు విలువిద్యలో ఉన్న ప్రతిభను ఆసక్తిని గ్రహించి, తన తండ్రి ప్రోత్సహించిన తీరు గుర్తుచేసుకున్నాడు. ✦


***With Best Compliments From :***



SteckSystems

# ఓ శకం ముగిసింది ... ఓ కమలం వాడింది

(కీర్తిశేషులు శ్రీ వాజపేయి గారికి స్మృత్యంజలి)

- వడ్డమాను వెంకట శివరాం



ఓ శకం ముగిసింది .... ఓ కమలం వాడింది

కుటిల కుచిత కుతంత్ర రాజకీయాల నడుమ వికసించిందా కమలం
స్వపర భేదం లేక అందరికీ స్నేహ సౌరభాలను వెదజల్లిందా కమలం

దళం కన్న దేశం మిన్న యని మనసా వాచా కర్మణా ఆచరించిందా కమలం
మృగ్యమౌతున్న మౌలిక విలువలకు పట్టం కట్టిందా కమలం
అశాశ్వతమైన పదవులను తృణ ప్రాయంగా త్యజించిందా కమలం

తన వాక్ప్రవాహ ఝరితో శ్రోతలను మంత్రముగ్ధులుగావించిందా కమలం
తన వాక్ప్రవాహమనే ఉత్ప్రేరకంతో అసంఖ్యాకుల్లో ఉల్లాసం ఉత్సాహం ఉత్తేజం
నింపి కర్తవ్యోన్ముఖులను గావించిందా కమలం
తన జీవిత రాజకీయపుటెడారిలో కవితా మలయ మారుతాలు ప్రసరింపచేసిందా కమలం

దురహంకార విజయ కాంక్ష తగదని నేటి నాయకులకు చెప్పకనే చెప్పిందా కమలం
వక్తృత్వం కవిత్వం దేశభక్తి పరాయణత్వం సమ్మిళితమైన అద్భుత ఆదర్శ వంతమైన జీవితానికిక సెలవ్ అంటూ
మహాభినిష్క్రమణం వైపు తరలిపోయిందా కమలం ✦

MATHNASIUM®
The Math Learning Centre

Round Rock
512-415-5371

Cedar Park
512-869-6284

# ప్రదక్షిణానికొక పద్యం

డా॥ రాంభట్ల పార్వతీశ్వర శర్మ



14 వ శతాబ్దానికి చెందిన పురాతన దేవాలయం – శ్రీకాకుళం జిల్లా, పలాస దగ్గరి మందస గ్రామంలోని – శ్రీ వాసుదేవ పెరుమాళ్ళ స్వామి ఆలయం. జీర్ణావస్థలో ఉంటే, కొన్నాళ్ల క్రిందట చిన్నజీయరు స్వామి దీనిని పునరుద్ధరించి నిత్యపూజలు ఉత్సవాలు జరుపుతున్నారట. అక్కడ 11 ప్రదక్షిణాలు చేయడం ఆనవాయితీ. 19వ తేదీ సాయంకాలమే దర్శించుకొని స్థలాపురాణాదులను స్పృశిస్తూ...
ఇలా ప్రదక్షిణానికి ఒక పద్యంతో ఆశువుగా అర్చించుకొన్నాను.

1) శ్రీ వాసు దేవ పెరుమా
ళ్ళూ! వేంకట నాథ విష్ణు రూపాస్తోకా!
శ్రీవర! మందసలో హరి
వై వెలసితివయ్య! దేవ వందిత చరితా!!

2) ఎక్కడి రాజుల పాలన?
ఎక్కడి దేవాలయమ్ము యిటు గట్టుటయున్?
చెక్కుంజెదరక యెక్కడ
నుక్కువలెన్ నిలుచుటన్న నో శ్రీమంతా!!

3) ఒక్కెడ గోదా దేవియు
నొక్కెడ లక్ష్మీలతాంగి యొదిగెను ప్రక్కల్
చక్కని భోగములందుచు
మక్కువగా భక్తతతని మన్నించుమయా!!

4) ఎవ్వరెరుగని నాడుల రివ్వుమనుచు
చిన్నజీయరు ఈ గుడి చేరి - స్వామి
యజ్ఞయాగాదులం పూర్ణహవనములను
తిరిగి నిల్పిరి నీఖ్యాతి తెలియ జగతి!!

5) ఏటికొక యుత్సవమ్మట
నాటిమొదలు వేంకటేశ ! నానా విధముల్
పాటించుచు సేవించిరి
చాటగ నీ కీర్తి దెసల స్వామి సురేశా!

6) కోటగట్టగ నొకనాడు నోటుబడియె
నాటి పాలకుడొక్క డిచ్చోటునందు
బ్రాహ్మణోత్తము నొక్కని బలియొనర్చె
బ్రహ్మనే హత్య జేసిన పాతకముగొనె


7) పిల్లలు జనియింపక తా
నల్లల్లాడుచును చాల వ్యాకులత గనెన్
ప్రల్లదముల్ తెల్పంగను
చల్లగ దేవాలయమ్ము స్వామీ! కట్టెన్!

8) సంతుగలిగెనంత వింతగ రాజుకు
సంతసిల్లి జంట సన్నుతించె!
పాపములను బాపు పావనుడంచును
"వాసుదేవ"నిన్ను భక్తి గొలిచె!!

9) గ్రామజనులను రక్షించు స్వామి వనగ
చెన్నుమీరితె "మందసన్" దన్ను వొచు!
లీలలెన్నని చెప్పంగ జాలగలము?
వేంకటేశుడ ! నీకు వేవేలనతులు!!

10) చెప్పితి బ్రదక్షిణమునకు
నొప్పెడు పద్యమ్ము శ్రీశ! యొక్కొక్కటిగా!!
తప్పులు గల్గిన పదపడి
నొప్పింపక కాచి మేటి నుడువుల నిడుమా!

11) మంగళమ్ము దేవ మత్స్యరూప విభవ!
మంగళమ్ము కూర్మమహిత భావ!
మంగళా వరాహ ! మౌనీంద్ర సంభావ!
తనుపుమా! దశావతార మూర్తి!!


ALL CITY
Real Estate, LTD. CO.
Austin, Texas
FOR ALL YOUR REAL ESTATE NEEDS, YOU NEED A TRUSTED REALTOR.
Reliable, Ethical, Accessible, Loyal, Transparent, Open, Righteous.
Sudhakar Karumuri (SK)
Specialized in Residential Home Buying / Selling and Leasing
Talk to me for the BEST DEAL
512-964-8693
Investment Properties and Lands Knowledge in Vastu
REALTOR®
skarumuri@yahoo.com http://www.allcityaustin.com

కథ

# భిన్నత్వంలో ఏకత్వం

- ఇర్షాద్ జేమ్స్

జగన్ పూర్తిపేరు జంబలకిడి జగన్‌మోహనరావు. జగన్ అమెరికా వచ్చి జగ్ అని పేరు మార్చుకున్నాడు. పిలవటానికి సులువుగా వుండటానికి. జగన్‌కి ముప్ఫై యేళ్ళుంటాయి. కాని ఇంకా పెళ్ళికాలేదు. జగన్ ఎప్పుడు ఇండియాకి ఫోన్ చేసినా, వాళ్ళమ్మ, నాన్న "ఒరేయ్, పెళ్ళెప్పుడు చేసుకుంటావురా?" అని అడుగుతూంటారు.

"నాకు పెళ్ళి ఇష్టంలేదమ్మా!!" అంటాడు జగన్.

కాని ఈసారి ఇండియాకి ఫోన్ చేసినప్పుడు జగన్ వాళ్ళ నాన్న ఒక కొత్త డైలాగు వేసాడు.

"ఒరేయ్, త్వరగా పెళ్ళి చేసుకోరా, మేము ముసలివాళ్ళమై పోతున్నాము", అన్నాడు జగన్ వాళ్ళ నాన్న.

"నేను పెళ్ళి చేసుకుంటే మీరు ముసలివాళ్ళవటం మానేస్తారా?" అని మనసులో అనుకున్నాడు జగన్. కాని బయటకి మాత్రం, "నాకు పెళ్ళి ఇష్టం లేదు నాన్నా!!" అని పాత డైలాగు వేసాడు జగన్.

ఈసారి జగన్ వాళ్ళమ్మ కొత్త డైలాగు వేసింది.

"ఒరేయ్, మా సంగతి పక్కన పెట్టు. నువ్వు కూడా ముసలివాడి వయిపోతున్నావు!!" అంది జగన్ వాళ్ళమ్మ.

"ఓ, నో!!! ఇది కరెక్టే....", అని మనసులో అనుకున్నాడు జగన్. కాని బయటకి మాత్రం, "నాకు పెళ్ళి ఇష్టంలేదమ్మా", అన్నాడు.

"ఎందుకొద్దూ? నీ ఫ్రెండు కుటుంబరావు చూడు, చక్కగా పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళకి ఐదుగురు పిల్లలు కూడా!!" చెప్పాడు జగన్ వాళ్ళ నాన్న.

"అవును, కుటుంబరావుది పెద్ద కుటుంబమే...." అని మనసులో అనుకున్నాడు జగన్.

కుటుంబరావు వాళ్ళకి మొదటిసారే ఇద్దరు అబ్బాయిలు (ట్విన్స్) పుట్టారు. ఒక అమ్మాయి కూడా వుంటే బాగుంటుందనుకొని, మళ్ళీ ట్రై చేసారు. ఈసారి ముగ్గురు అమ్మాయిలు (ట్రిపుల్స్) పుట్టారు.

జగన్ ఒకసారి వాచిలో టైమ్ చూసుకొని, "నాకు పెళ్ళి ఇష్టంలేదు నాన్నా. నేను ఫోన్ పెట్టేస్తున్నాను. తర్వాత మాట్లాడతాను." అన్నాడు.

వెంటనే జగన్ వాళ్ళమ్మ, "ఆగాగు, అప్పుడే పెట్టెయ్యకు, నీకో విషయం చెప్పాలి", అంది కంగారుగా.

"ఏమిటమ్మా" అడిగాడు జగన్.

"మీ నాన్నగారి ఫ్రెండు అప్పడాల అప్పారావుగారు గుర్తున్నారా? వాళ్ళు చాలా సంవత్సరాలుగా అమెరికాలోనే వుంటున్నారు. వాళ్ళమ్మాయి అప్పడాల అంబాదేవి కూడా మీ టెక్సాస్‌లోనే వుందట. మీ ఇద్దరి జోడీ చాలా బాగుంటుందిరా. నీకు ఫొటో పంపించనా?"

"వద్దమ్మా, నేను తర్వాత మాట్లాడతాను", అని ఫోను డిస్కనెక్ట్ చేసాడు జగన్.

★ ★ ★

ఆరోజు సాయంత్రం జగన్ గోల్డ్స్ జిమ్ నుంచి బయటకి వచ్చి, పార్కింగ్ లాట్‌లో తన కారువైపు నడుస్తూంటే, అతని ఫ్రెండు మల్లిక్ కనిపించాడు.

మల్లిక్ పూర్తిపేరు మాయమాటల మల్లికార్జునరావు.

మల్లిక్ అమెరికా వచ్చి మాక్ అని పేరు మార్చుకున్నాడు.

"హౌ ఆర్ యూ?" అని పలకరించాడు మల్లిక్.

"సూపర్ గురూ, నువ్వు కూడా గోల్డ్స్ జిమ్‌కి మారావా?" అడిగాడు జగన్.

"అవును. ఇంతకు ముందు వేరే జిమ్‌కి వెళ్ళేవాడిని. ఇదయితే ఆఫీసుకి దగ్గరని ఇక్కడికి మారాను" చెప్పాడు మల్లిక్.

"ఓ, కూల్, కూల్. హౌ ఈజ్ మేరీడ్ లైఫ్?" అడిగాడు జగన్.

"సో ఫార్. సో గుడ్. మీ పేరెంట్స్ ఎలా వున్నారు?" అడిగాడు మల్లిక్.

"ఆ, బాగానే వున్నారులే", అన్నాడు జగన్, కొంచెం చిరాకుగా.

"లెట్ మీ గెస్.... పెళ్ళిచేసుకోమంటున్నారా?" అడిగాడు మల్లిక్.

"అవును. ఎప్పుడూ అదే గోల."

"అయితే పెళ్ళిచేసుకోవచ్చుగా?" అని నవ్వాడు మల్లిక్.

"పెళ్ళా? ఎందుకొచ్చిన గొడవరా బాబూ? ఇప్పుడు లైఫ్ ఈజ్ గుడ్. నన్ను ఇలగే వుండనీ."

"అయితే ఎప్పుడూ పెళ్ళిచేసుకోవా? ఇలాగే వుండిపోతావా?"

"అవును."

"మరి మీ పేరెంట్స్ ఓకేనా?"

"నా పేరెంట్స్ కోసం నేను పెళ్ళిచేసుకోవాలా?"

"సరే, నీ కోసం అయినా చేసుకో".

"నేను చిన్నప్పటినుంచి ఎన్నో ఫ్యామిలీస్ చూసాను. హస్బెండ్, వైఫ్ ఎప్పుడూ ఏదో కారణం వల్ల గొడవ పడుతుంటారు. పెళ్ళి చేసుకొని కొట్టుకొని చావటంకన్నా, సింగిల్‌గా ప్రశాంతంగా వుండటం బెటర్." చెప్పాడు జగన్.

"పోనీ అరేంజ్డ్ మేరేజ్ కాకుండా, డేటింగ్ చేసి నీకు నచ్చిన అమ్మాయినే చేసుకోవచ్చుగా?"

"పెళ్ళి చేసుకోవటం సులభమే. ఆ తరువాత మొదలవుతాయి కష్టాలు. ఈ మధ్య డివోర్స్ రేట్ చాలా ఎక్కువయిపోయింది. అమెరికాలో, ఇండియాలో కూడా."

"అయితే సోలో లైఫే సో బెటరు అంటావా?" నవ్వాడు మల్లిక్.

"అవును", అన్నాడు జగన్.

"ఇప్పుడు సింగిల్‌గా బాగానే వుండొచ్చు. కానీ తరువాత ఓల్డ్ ఏజ్‌లో నీకు ఎవరయినా తోడు వుండాలిగా?" అడిగాడు మల్లిక్.

"ఎప్పుడో ఓల్డ్ ఏజ్‌లో తోడు కోసం ఇప్పటినుంచె కాంప్రమైజ్ అవ్వాలా? అయినా, ఓల్డ్ ఏజ్‌లో ఇంకొకరి మీద డిపెండ్ అయి, వాళ్ళని కష్టపెట్టటం కన్నా, యేదైనా సీనియర్ లివింగ్ హోంలో డబ్బులిచ్చి వుండటమే బెటర్." చెప్పాడు జగన్.

"మరి నీకు పిల్లలు వద్దా?" అడిగాడు మల్లిక్.

"పిల్లలా? ఒకవైపు ప్రపంచ జనాభా పెరిగిపోయి, చాలా దేశాలలో తిండిలేక చస్తుంటే, ఇక్కడ మనం ఇంకా పిల్లల్ని కనాల్సిన అవసరం వుందా?" కోపంగా అడిగాడు జగన్.

"సరే. నీతో వాదించటం కష్టం. యూ ఆర్ ఫ్రీ టు డూ వాటెవర్ యూ వాంట్!!" చెప్పాడు మల్లిక్, తన కారు డోరు తెరుస్తూ.

"కరెక్ట్. పెళ్ళిచేసుకుంటే ఆ ఫ్రీడం పోతుంది. టాక్ టు యూ లేటర్. నేను రేపు పొద్దున్నే సాన్ ఆంటోనియో వెళ్ళాలి. ఒక కాన్ఫరెన్స్ వుంది", అని తన కారువైపు నడిచాడు జగన్.

★ ★ ★

ఆ మరుసటి రోజు పొద్దున్నే జగన్ ఆస్టిన్ నుంచి గంటన్నర డ్రైవ్ చేసి, సాన్ ఆంటోనియో చేరుకున్నాడు.

రివర్ వాక్ పక్కన వున్న హిల్టన్ హోటెల్‌లో ఆరోజు ఒక టెక్నాలజీ కాన్ఫరెన్స్ వుంది.

కాన్ఫరెన్స్‌లో మార్నింగ్ సెషన్ అయిన తరువాత, లంచ్ బ్రేక్ మొదలయింది.

జగన్ బయటకి వచ్చి, సాండ్‌విచ్ తిని, కాఫీ తాగుతూ కూర్చున్నాడు. తన సెల్‌ఫోన్‌లో మెసేజెస్ చూసుకుంటూ.

"ఎక్స్‌క్యూజ్‌మీ, ఈజ్ దిస్ సీట్ టేకెన్?" అని అడిగింది ఒక ఆమె వచ్చి.

"నో, ప్లీజ్ హేవ్ ఎ సీట్", అన్నాడు జగన్.

"థేంక్ యూ సో మచ్" అని కూర్చుంది ఆమె.

ఆమెని ఇంతకు ముందు ఎక్కడో చూసినట్టు అనిపించింది జగన్‌కి.

"మై నేం ఈజ్ జగన్. అయాం హియర్ టు అటెండ్ ది ఇంటర్నెట్ సెక్యూరిటీ సెషన్" అన్నాడు జగన్.

"మై నేం ఈజ్ ఏమీ", అంది ఆమె.

"విచ్ సెషన్ ఆర్ యూ అటెండింగ్?" అడిగాడు జగన్.

ఇంతలో ఏమీ ఫోన్ మ్రోగింది.

"వన్ సెకండ్ ప్లీజ్....", అని ఫోన్ అందుకుంది ఏమీ.

"నేను సాన్ ఆంటోనియోలో వున్నాను. తరువాత మాట్లాడతాను", అని ఫోన్ డిస్కనెక్ట్ చేసింది ఏమీ.

"ఓ, మీరు తెలుగు మాట్లాడతారా?" ఆశ్చర్యంగా అడిగాడు జగన్.

"అవును. నేను చిన్నప్పుడే మా పేరెంట్స్ వైజాగ్ నుంచి అమెరికా వచ్చారు", నవ్వుతూ అంది ఏమీ.

"ఓ.... నైస్" అన్నాడు జగన్.

ఇంతలో ఏమీ ఫోన్ మళ్ళీ మ్రోగింది.

"సారీ, వన్ సెకండ్"; అని ఫోన్ అందుకుంది ఏమీ.

"అమ్మా, నేనిప్పుడు బిజీగా వున్నాను. తరువాత ఫోన్ చేస్తాను", అని ఫోన్ డిస్కనెక్ట్ చేసింది ఏమీ.

"సారీ, మా అమ్మ" అంది ఏమీ.

"ఇట్స్ ఓకే, ఐ అండర్‌స్టేండ్", అన్నాడు జగన్.

"యూ డూ?" అని నవ్వింది ఏమీ.

"యెస్. ఏబ్సల్యూట్లీ. మా పేరెంట్స్ కూడా నాకు రోజూ వాట్సాప్ ద్వారా ఫోన్ చేస్తూంటారు. పెళ్ళి చేసుకోమని ఒకటే గోల, ఎప్పుడూ". అన్నాడు జగన్.

"మీకిష్టం లేదా?" అడిగింది ఏమీ.

"నాటెటాల్!!" అన్నాడు జగన్.

"మా పేరెంట్స్ కూడా నన్ను ఎప్పుడూ అదే అడుగుతూంటారు", చెప్పింది ఏమీ.

"ఓ, అవునా...." అన్నాడు జగన్.

"అవును.... ఐ వాంట్ టు ఫోకస్ ఆన్ మై కెరీర్. నాకు ఇప్పుడే పెళ్ళి చేసుకొని, పిల్లల్ని కని, ఒక ఇంట్లో పడి ఉండాలని లేదు. ఒకప్పుడయితే అమ్మాయిలు పెళ్ళి చేసుకొని, ప్రతిదానికి

భర్తలపై డిపెండ్ అయి వుండేవారు. ఈ రోజుల్లో అమ్మాయిలు చదువుకొని వుద్యోగాలు చేస్తున్నారు. అసలు పెళ్ళి చేసుకోవలసిన అవసరమే లేదు. ఐ లైక్ టు హేవ్ మై ఫ్రీడం", చెప్పింది ఏమీ.

"ఏబ్సల్యూట్లీ", అన్నాడు జగన్. కాఫీ తాగటం మర్చిపోయి ఆశ్చర్యంగా వింటూ.

"మా పేరెంట్స్ ఎప్పుడూ నన్ను పెళ్ళి చేసుకోమని, ఒక మనవడిని కనమని, అంటూంటారు. ఒకవైపు ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. ఎంతోమంది అనాధలు వున్నారు. ఐ వుడ్ లైక్ టు అడాప్ట్ ఎ కపుల్ ఆఫ్ ఓర్ఫన్ చిల్డ్రన్. వాళ్ళని చక్కగా పెంచి, మంచి భవిష్యత్తు వుండే అవకాశం కల్పించాలి...." అంది ఏమీ.

"వెరీ వెల్ సెడ్" అన్నాడు జగన్.

ఇంతలో కాన్ఫరెన్స్ రూంలో బెల్ మ్రోగింది. మధ్యాహ్నం సెషన్ మొదలు కాబోతోంది.

"ఒకే, టాక్ టు యూ లేటర్. ఐ హేవ్ టు గో టు మై సెషన్", అని లేచింది ఏమీ.

"షూర్. బై ద వే, నా పేరు జగన్. నేను ఇప్పుడు ఇంటర్నెట్ సెక్యూరిటీ సెషన్‌కి వెళ్తున్నాను" అని లేచాడు జగన్.

"ఓ, అయాం ది స్పీకర్ ఫర్ ది ఇంటర్నెట్ సెక్యూరిటీ సెషన్. అయాం ఏమీ అప్పడాల", అంది ఏమీ.

★ ★ ★

కొన్ని రోజుల తరువాత....

జగన్ ఇండియాకి ఫోన్ చేసి, వాళ్ళమ్మతో మాట్లాడుతున్నాడు.

"....అవునమ్మా, బాగానే వున్నాను", అన్నాడు జగన్.

"అవును.... నిన్నొక విషయం అడగాలి. కోప్పడతావేమో....", అంది జగన్ వాళ్ళమ్మ.

"ఏమిటమ్మా?" అడిగాడు జగన్.

"నీకు చోడవరం నుంచి మంచి సంబంధం వచ్చిందిరా. చాలా మంచి ఫ్యామిలీ. అమ్మాయి చాలా చక్కగా వుంది. నీకు ఫొటో పంపించనా?" అంది అమ్మ.

"వద్దమ్మా" అన్నాడు జగన్.

"ఏం? ఎందుకొద్దూ?" కోపంగా అడిగింది అమ్మ.

"అమ్మా, నాకు ఇక్కడ ఒకమ్మాయి నచ్చింది....", చెప్పాడు జగన్. ✦



# తెరచిన పుస్తకం

- రాంభట్ల వేంకటరాయ శర్మ

నా జీవితం తెరచిన పుస్తకం
అనే  వాక్యాలు చెవిన పడ్డప్పుడల్లా
ప్రతి పుటలోనూ ఎవరో రాసేసిన
చేతి రాతలే కనిపిస్తున్నాయి....

ఈ పుస్తకంలో ఒక్కో పేజి
నా జీవితంలో గడచిన
ఒక్కో సంవత్సరం...

ముప్పయ్యేళ్ల  జీవన యానంలో
వెనక్కి తిరిగి, గతకాలపు
కాలమ్‌లను , తిరగేస్తే,
నా చేతి రాత కన్నా
చుట్టూ ఉన్న వారివే ఎక్కువ....
అన్ని పుటలలో, అడ్డదిడ్డగా
ఎవరిష్టం వచ్చినట్టు వారు గీకి పారేసిన జ్ఞాపకాలే.....

నా జీవన పుస్తకంలో  తొలి సంతకం
మా అమ్మది....
తర్వాత మానాన్న గారిదే....

ఐదవ పుటలో, ఉన్న కొన్ని అక్షరాలు మాత్రం
చెరగకుండా పదిలంగా గుండెలోతులలో
ఉండిపోయాయి.... అక్షరాభ్యాసంనాడు అమ్మానాన్నలు చెప్పిన
అబద్ధమాడకూడదని
నిబద్ధత తో బతకాలనే మాటలు....

తర్వాతి పుటలలో, ఎవరెవరివో
ఎందుకెందుకో గుర్తుపట్టలేని స్థితిలో
ఉన్నా, కొన్ని మాత్రం చెరగకుండా మిగిలే ఉన్నాయి...

ఇన్ని పేజీలలో,
స్నేహితుల ఊహాతిసయాలు
బంధుగణపు సందోహాలు
ఉపాధ్యాయుల  ఊరడింపులు
ఉద్యోగపు ఉద్వేగాలు
కలగలిసిన భావాంతరంగాలతో
నిండిపోయాయి పేజీలు....

ఇన్నాళ్ల జీవన యానంలో
నాలో భావనలు
నా లిలోలి భావాంతరంగాలను,
తమ రాతలతో చెరిపేసి
ఎవరెవరి దస?తులనో చేసిపారేశారు....

సరే, ఇకనైనా , నా జీవిత పుస్తకంలో
ప్రతి పేజీలో నా చేతిరాత నేరాసుకుంటా.....
ముఖ్యంగా... వీరికి మాత్రం పుటలు కేటాయించేదే లేదు...

బ్రతికి చెడ్డవారికి
చెడి బ్రతికిన వారికి నా పుట ఇస్తానేమో గానీ
తను బతకడానికి పక్కవాణ్ణి చెడగొట్టే వాడికి మాత్రం
పుటలుండవిక్కడ....

కర్కోటక విషజ్వాలలతో
కర్కశ పదజాలంతో
మర్కటమేధా సంపత్తితో
తర్కించే వారికి కూడా
నా పుటపు రాతలుండవిక....

ముసిముసి నవ్వుల
పసి బిడ్డలలో
రసికత చూపే, అసుర జాతి యావత్తుకు
పుటఉండబోదిక....

ఇన్నాళ్లూ, ఇన్నేళ్లలో
నా జీవన పుస్తకంలో
ప్రతి పేజీలో ఉన్నది,
నాకెంతో ఇష్టమైనది, మా అమ్మ చేతి రాత......

# యాద్గిరిగాని ముచ్చట్లు

2

– ఎస్.వి. ప్రసాద్

ఏంది సార్, అవుపిస్తలేరు? మీ దిక్కుకెంచే సూస్తాంటిని చాన దినమ్లకెంచి.

ఏం యాదగిరి? ఏం సంగతులు? నేను వూరికి వెళ్లాను ఈ మధ్య .నిన్ననే వచ్చాను .

ఏంది సార్, దేశం గిట్ల వోయొచ్చిన్రా? చెప్పకుంట వొయిన్రు. గాడికెంచి నాక్ తెలుగు కాలండర్ గిట్ల గావల్సినుండె. నాగ్గిట్ల ఎర్కుంటే నేన్ మీక్ జెప్తుండె సార్ తెలుగు కాలండర్ తీస్కరమ్మని. చెప్పకవోతిరి.

ఎందుకయ్యా, తెలుగు కాలండర్ నీకు? ఏం నువ్వేమైనా పండితుడివా లేక నువ్వేమైనా ముహుర్తాలు పెట్టాలా ఏ పెళ్ళికైనా?

గంతే సార్, మాసొంటి సదువురానోల్లను జూస్తే గట్లనె అంటర్ సార్.

సర్లేవయ్యా, ఏదో పొరపాటున నోరు జారి అలా అన్నాను. ఏదో నిన్ను తమాషా చెయ్యాలనే ఉద్దేశ్యంతో కానే కాదు. ఎందుకు, తెలుగు కాలెండర్తో ఏం అవసరం ఇప్పుడు నీకు?

సార్, ప్రతి సమత్సరం మా అమ్మ చనిపోయ్న దినం యాద్జేస్కుంట, గందుకె నాక్ తెలుగు కాలెండర్ గిట్ల గావలె, సార్. మా అమ్మ చాన మంచి మనిసి సార్. మా నాయ్న రాక్షసుని లెక్క ఉంటుండెనని మా ఊరోల్లు జెప్తుండె. నాకెర్కె లేకుండె, సార్.

అదేంటి, మీ నాన్న గురించి నీకు తెలియదా?

నాక్ దెల్వది, సార్. నేను చిన్నగున్నప్పుడె వోయిండు పైకి. మా నాయ్నకి పొలం గిట్ల ఎక్కువేమి లేకుండెనంట. ఆయ్న మస్తు గుడంబ గిట్ల దాగి మా అమ్మను బగ్గ గొడ్తుండెనంట. నాగ్గిట్ల తెల్వది సార్, మా అన్నలు జెప్తుండె. నాక్ మూడేల్లున్నపుడు ఒక్క దినం బగ్గ దాగి మా అమ్మని గిట్ల మస్తుగ్గొట్టి ఇంట్లకెంచి బయటకి వోయిన్డంట. గా రాత్రి ఇంటిగ్గిట్ల రాలేదంట. పొద్దుగాల ఊరోల్లొచ్చి జెప్పిన్రంట మా అమ్మకి నీ పెన్మిటి సచ్చిపోయిండని. రాత్రెప్పుడో బాయ్ల బడిన్డంట. మా నాయ్నకు మస్తు ఈతొస్తుండెనని జెప్తుండె సార్, గాని బగ్గ దాగిందిక్కెంచ్చి బాయ్లకెంచి బయటికెల్లనికి అవ్వక పాయెనేమో. ఎవ్వలన్న బాయ్ల నూకిన్రొ లేక పిచ్చిలేసి గట్లజేసిండో బగమంతున్కె ఎర్క.

మా నాయ్న వోకముందే పొలంగిట్ల అంతవాయెనంట. మా అమ్మ పాపం కూలిజేస్తుండె వేరోల్ల పొలమ్ల. మా అమ్మ ఎప్పుడు ఎవ్వల్ని సాయం గిట్ల అడ్గక వోతుండె. మా అమ్మ చాన కష్టజీవి, సార్. మమ్లని కష్టపడి సాకింది, మేం ముగ్గురు పొలగాన్లం. మా ఇంట్ల నేనే అందరికంటె చిన్నవాన్ని.

మా పొలగాన్లకి బువ్వ పెట్టినంక, లీల్లు దాగి పండ్తుంటె ఆమె. నాగ్గిట్ల జర్ర బుద్దొచ్చినంక ఆయ్మెను తిడ్తుండె నేను, గెట్లనె అమ్మ తినకుంట గెంద్కుంటవని. గప్పట్కే ఆయ్మె సగం పానంతోని ఉంటుండె. గేంజెయ్యాల సార్, గరీబోల్లం, మా తాన పైసల్లేకుండె గప్పుడు. గా ఉన్నన్ని పైసల్బీ పొలగాన్లకి బువ్వ మల్ల బట్టల్గిట్ల కొననికి సాలకుంటుండె. మా అమ్మ తాన రెండే చీరలుంటుండె. పెన్మిటి లేకున్నగాని ఆయ్మె రెక్కల కష్టంతోని మమ్లను చాన మంచిగా సాకింది, సారూ.

నాక్ పదేల్లున్నప్పుడు మా అమ్మ జచ్చిపాయె. గా దినం బగ్గ ఏడ్చిన సార్. సచ్చిపోయె ముందు దినాంబీ ఏడుస్తుండె, ఒరే యాదిగా పెయ్య నొస్తుందిరా అని. మా అమ్మ సచ్చిపోయిన దినం గిప్పట్కి నా కండ్ల ముందు కనవడ్తది. నాక్ నల్బై ఏండ్లు సార్ గిప్పుడు, గిప్పట్కి గాయ్మె యాదికొస్తె నాగ్గిట్ల కండ్లల్ల నీర్ సర సర గార్తది. జల్మ జల్మలకి గసొంటి తల్లేగావాల్నని నా కోర్కె.

PS : జీవిత భాగస్వామి తోడువిడిచినా, పిల్లలను సక్రమంగా పెంచి పెద్ద చేసే యాదగిరి తల్లిలాంటి ఎందరో లక్షలాది మాతృమూర్తులకు పాదాభివందనాలతో నా శెలవు. ✦

## మంచిమాటలు

**చిన్నప్పుడు దేన్నయినా పట్టుకుని నిలబడాలి**
**పెద్దయ్యాక దేన్నయినా తట్టుకుని నిలబడాలి**

**మనిషి బాధలో ఉన్నప్పుడు**
**డబ్బు సహాయం చేయకపోయినా పర్వాలేదు కానీ**
**మాట సహాయం చేయండి.**
**ఎందుకంటే**
**'మీ మాట వారికి మనోధైర్యాన్ని' ఇస్తుంది**

# సత్యమేది ? అసత్యమేది ?

- వడ్డమాను వెంకట శివరాం

కాసులకు కలాలు గళాలు అమ్ముడైన వేళ
సత్యమేది ? అసత్యమేది ? అనే సందిగ్ధంలో
జనసముదాయం ఊగిసలాడుచున్న వేళ
నేతల నైతిక విలువలు నేతి బీరకాయలైన వేళ
నాది నాదను సంకుచిత ధోరణులతో
విశ్వం, దేశం కొట్టుమిట్టాడుచున్న వేళ
మదిలో మెదిలిన ఆలోచనలు

అసలు మనం ఏలికలనుంచి ఏమాశించాం ?
రహదారులు మృత్యుకుహరాలు కాకుంటే చాలు
బోరు బావుల్లో బోరుమనే బాలల ఆర్తనాదాలు
వినిపించకపోతే చాలు
రహదారులు నదుల్లా ప్రవహించకపోతే చాలు
నదుల కోసం రక్తపు టేరులు పారించకపోతే చాలు

సారే జహాం సే అచ్చా కన్నా
ప్రపంచమంతా బాగుండాలి అందులో మనముండాలి
అన్న భావం ఎంత గొప్పది

దేశభాషలందు తెలుగు మాత్రమే లెస్స కాదు
దేశభాషలన్నియు లెస్సయే
అన్న భావం ఎంత ఉదాత్తమైనది

దేశభక్తి కన్నాసర్వ మానవ సౌభ్రాత్రుత్వమనే
భావన ఎంత ఉత్కృష్టమైనది

మన పక్కింటి వాడు, పొరుగు రాష్ట్రం వాడు
విదేశాలనుంచి వచ్చిన అతిథులు అందరూ మన సోదరులే
వారినీ గౌరవిద్దాం బ్రతకనిద్దాం

మన ప్రధాన సమస్య ఆహార కొరత, నీటి కొరత కాదు
అన్నిటికీ మూలమైన భావదారిద్ర్యం

స్వంత లాభం కొంత మానుకుని
నలుగురితో నాలుగు రోజులు నవ్వుతూ సరదాగా
ప్రయాణించాలనే చిన్నిఆశతో
ఒక వినూత్న పథం వైపు వడివడిగా అడుగులేద్దాం రండి ✦

HealthCare.com
HealthCare Made Simple

Koteswara Rao Kunda, MD

# సంస్కారం

– లోహిత్‌కుమార్, యాక్టర్

వాడికి ఏ లోటు రాకుండా చూసుకోవాలి, ఉన్నత చదువులు చదివించాలి. బాగా సంపాదించాలి, అందరూ నా కొడుకు గొప్పతనము గురించి మాట్లాడుకోవాలి. అనుక్షణం ఇవే కలలు కన్నాను. అనుకున్నట్లుగానే మంచి స్కూల్‌లో చదివించాను. ఉన్న భూమి అమ్మి ఎంఎస్ చెయ్యడానికి పెద్ద దేశంలో మంచి యూనివర్శిటీ సీటు సంపాదించి పంపించాను.

కాలగమనంలో గిర్రున తిరిగి చూసుకునేటప్పటికి చెట్టంత ఎదిగిన కొడుకు చుట్టమయ్యాడు. వాడికి ఉద్యోగం, పిల్లలు, కుటుంబం, బాధ్యతలు. ఇప్పుడు నా అవసరం వాడికి లేదు. దేశం వెళ్ళిన మొదట్లో రోజూ ఫోన్ చేసేవాడు. ఇప్పుడు అప్పుడప్పుడు ఒక మెసేజ్ పంపుతున్నాడు. వాడిని చూసి చాలా రోజులు అయింది. ఎందుకో చూడాలని అనిపిస్తుంది. ఆకరిసారిగా ఒకసారి వస్తే బాగుండు.....

ఆగండ్రా వాడు వస్తాడు అని గట్టిగ అరిచి చెప్పాలని వుంది. కానీ నా మాట ఎవరికీ వినిపించట్లేదు. అందరూ వాడిని తిట్టుకుంటున్నారు. అది నాకు కష్టంగా ఉంది. నన్ను కాల్చారు, వాడు రాలేదు. అంతిమ సంస్కారాలు ఘనంగా జరగాలి, ఏ లోటూ రాకుండా చూడండి. డబ్బు ఎంతైనా పరవాలేదు. నాకు లీవ్ దొరకలేదు అని చెప్పాడట.

నాకు లీవ్ దొరికింది. ✦


MY TAX FILER

- Business Formation
- Strategic Tax Planning
- Tax Return Preparation
- Accounting
- Payroll Processing
- FBAR & Foreign Compliance
- IRS Amnesty Programs
- Notice Representation
- Inheritance & Repatriation



Guru C Reddy Dorsala, MBA, EA

All your accounting, payroll and tax needs under one roof – Contact us today for a FREE consultation

Office: 13276 Research Blvd Ste#202, Austin, TX 78750

(512)-766-5829/ austin@mytaxfiler.com

# ప్రగతిపథం

- వెంకట ఎస్. రాజు

ప్రథమ దేవుని పూజించి,
ప్రమథ నాథుని ప్రార్థించి,
ప్రణవ నాదమై ఘోషించి,
ప్రకృతి పురుషుల ఆరాధించి,
పయనిద్దాం, ప్రగతి పథంలో పయనిద్దాం!

ఆత్మబలంతో ఉద్దీపించి,
దుష్ట శక్తులపై ప్రకోపించి,
మనోబుద్ధుల ప్రేరేపించి,
ఇంద్రియశక్తుల నిగ్రహించి,
పయనిద్దాం, ప్రగతి పథంలో పయనిద్దాం!

కోపతాపాలు తొలగించి,
ఆశాదీపాలు వెలిగించి,
మదమత్సరాలు అణగించి,
ఉదయాస్తమాలు గణుతించక,
పయనిద్దాం, ప్రగతి పథంలో పయనిద్దాం!

బాధలతో దుఃఖించక,
కష్టాలను లెక్కించక,
ఆపదలను ఆదరించక,
అడ్డంకుల ఆమోదించక,
పయనిద్దాం, ప్రగతి పథంలో పయనిద్దాం!

ఆయుధాలు సంధించక,
సుఖశాంతులు అందువరకు,
మనగమ్యం మరిచిపోక,
మన లక్ష్యం చేరువరకు,
పయనిద్దాం, ప్రగతి పథంలో పయనిద్దాం!

కంటకాలు ఏర్చివేసి,
కుంటలన్ని పూడ్చి వేసి,
రాళ్ళబాటనే రాచబాటగా మారుద్దాం,
వల్లకాటినే పూలతోటగా తీరుద్దాం!
పయనిద్దాం, పయనిద్దాం, ప్రగతి పథంలో పయనిద్దాం! ✦

Mathews
CPA Inc.

O: 512-710-1000
C: 512-785-6495
Fax: 512-356-9717
Email: mathews@mathewscpainc.com

9415 Burnet Road
Ste 210
Austin TX 78758

www.mathewscpainc.com

# భక్తి – మానవత్వం

- గంగుల శ్రీహరి

"నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని, అగ్గితోటికడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని... మారదులోకం... మారదుకాలం..." అని ఊరికే అనలేదు సిరివెన్నెల సీతారామశాస్త్రి! ప్రస్తుత సమాజంలో విపరీతంగా వీస్తున్న 'భక్తి' పవనాలు ఆ మాటల్ని అక్షరసత్యాలు చేస్తున్నాయి. ఆధ్యాత్మిక ముసుగుతో భక్తిరూపంలో కొనసాగుతున్న మౌఢ్యం ప్రస్తుతం పరాకాష్టకు చేరిందనే చెప్పాలి. ఓపక్క కులం, మరోపక్క అసూయ, స్వార్థం, సంకుచిత మనస్తత్వాలతో కుళ్ళికంపుకొడుతున్న రొంపిలో జనాలు పందుల్లా దొల్లుతుంటే మొత్తం దేశంమీదే అసహ్యం పుట్టకమానదు. 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడవారి మాటల్ని సవరించుకోవాల్సిన దుస్థితికి ఎప్పుడో దిగజారిపోయాం. ఎందుకంటే దేశంలోని మట్టి మాత్రమే పుణ్యభూమిగా మిగిలింది. మనుషులు మాత్రం దరిద్రానికి బ్రాండ్ అంబాసిడర్లలాగా బతుకుతున్నారు. ఇక్కడ దరిద్రం అంటే పేదరికం కాదు, దిగజారిపోయిన మానవ విలువలు. ఓపక్క పూజలు, వ్రతాలు, యజ్ఞాలతో భగవంతుడే బెదిరిపోయి పారిపోతాడా అన్నంతగా వేదభూమి అదిరిపోతుంటే మరోపక్క నిత్యం జుగుప్సాకరమైన సంఘటనలు ఒళ్ళు జలదరింపజేస్తున్నాయి. 'భక్తిరసం ఇంతగా పొంగి, పొర్లి, కారిపోతుంటే మరి ప్రజలంతా మంచివాళ్ళుగా మారిపోయుండాలి కదా, మరి అలా ఎందుకు జరగట్లేదు' అని ప్రశ్నించిన ఏబీన్రాధాకృష్ణ మాటలు సత్యదూరం కానేరవు. ఎందుకంటే ఆ కారుతున్న భక్తిరసమంతా నిజంగా భగవంతుడి మీద ప్రేమ కాదుబీ 'నాకింకా దోచిపెట్టెయ్, ఇంకా ఇంకా సిరులు కురిపించెయ్, నీకు ఆ యాగం చేయిస్తా, ఈ వస్తువు చేయిస్తా' అంటూ మొక్కులు మొక్కుతూ మన లంచగొండితనాన్ని బయటపెట్టుకునే ఒక తంతు కాబట్టి! అయ్యప్ప మాల వేసుకుని కూడా నిస్సిగ్గుగా లంచం అడిగి తీసుకుంటూ 'దేనిపనిదానిదే' అనే ప్రభుత్వోద్యోగులు పుష్కలంగా ఉన్న భక్తి సమాజం మనది. ఇలా స్వార్థపూరితమైన భక్తిలోనుంచి మంచి బయటకి రమ్మంటే ఎలా వస్తుంది?!

ఇక భక్తి ఉద్యమంగా చెప్పుకుంటున్న టీవీచానళ్ళవాళ్ళు.... ఒకపక్క ఆధ్యాత్మికవేత్తలతో భక్తి, సంస్కృతీ సాంప్రదాయాల విషయాలను చర్చిస్తూ, వెంటనే మరుసటి కార్యక్రమంలో 'ప్రాయోజిత కార్యక్రమం' పేరుతో చేస్తున్న అఘాయిత్యం ఇంతా అంతా కాదు. ఎవడో ఓ పనికిమాలినవాణ్ణి అక్కడకూర్చోబెట్టి వాణ్ణి గురువుగా సంభోదిస్తూ, 'ఆ పూజలు చెయ్యి, ఈ దానాలు చెయ్యి, ఈ యాగం చేయించు అని ఒకడు బీ ఇంగ్లీషులో 'నీ పేరులోని అక్షరాలు మారుస్తాను, అవి రోజుకి 100 సార్లు రాస్తూ ఉండు, ఇంటినిండా నీ పేరు రాస్కో, నీ జీవితమే మారిపోతుందని' మరొకడు అంటే – ఇలాంటివాళ్ళ వెంటపడి వేలకువేలు తగలేసుకునేమూర? శిఖామణులు ఎంతమందో! ఏ శాస్త్రంలోనూ చెప్పకపోయినా పిల్లలకి వారి నక్షత్రాన్ని బట్టే పేరు పెట్టాలన్న మూసధోరణిలో, ఆ అక్షరాలతో కుదరకపోయినా, అర్థంపర్థంలేని, వ్యతిరేకార్థాలనిచ్చే పేర్లుపెట్టి, కనీసం వాటి అర్థాలు కూడా తెలీకుండా అబ్బో "మేం సాంప్రదాయాన్ని చాలా ఖచ్చితంగా పాటిస్తాం" అని బిల్డప్ ఇచ్చే ప్రబుద్ధులు మన చుట్టూ కోకొల్లలు. ఇదీ ఈనాటి భక్తి!! అంతేగానీ, "నీ ఎదురుగా వాడు కూర్చొని ఉన్నాడన్న విశ్వాసంతో, చెయ్యకుండా ఉండలేక ప్రేమతో చేసే ఉపచారమే పూజ, అది లేనినాడు ఎందుకొచ్చిన దిక్కుమాలినపూజ, అది పూజకాదు తంతు" అన్న శ్రీచాగంటివారి మాటలు మనకు పెద్దగా ఎక్కవు. అలాగే "ఎంతకాలం దీపంలో రెండు వత్తులెయ్యాలా, మూడు వత్తులెయ్యాలా అన్న విషయం దగ్గర ఆగిపోతావ్, తత్వం తెలుసుకో, భగవంతుడికి దగ్గరవ్వు, ఏవిషయమైనా నీకు నువ్వే భగవంతుడికి చెప్పుకో, ధర్మంగా బతుకు, అప్పుడు అన్నీ ఆయనే చూసుకుంటాడు" అన్నమాటలు కూడా పెద్దగా రుచించవు. ప్రతీదానికీ అడ్డదారి కావాలి మనకి, భగవంతుణ్ణి బుట్టలో వేసుకునే మార్గాలు! ఎంత అజ్ఞానం!!

ఆఖరికి విదేశాల్లో ఉన్నతస్థితిలో బతుకుతున్నవారు సైతం కులాలపేరుతో గ్రూపులు, ప్రాంతాలపేరుతో సంఘాలు,

స్వదేశంలోని పార్టీలపేరుతో ప్రచారాలు, చివరికి సినిమావాళ్ళ పేరుతో అభిమానసంఘాలు ఇలా ఒకటేమిటి – శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలన్నట్టుగా – సకల దరిద్రాలని నెత్తిమీద పెట్టుకునిమరీ బతికేస్తున్నారు. వీటికి అతీతంగా ఉన్న కొద్దిపాటి మిగిలినవారైనా కాస్త హుందాగా బతుకుతారా అంటే వాళ్ళు తిండిమానేసి, నేలనినాకి బతికేద్దాం అనుకునేవారేగానీ కనీసం ఎంగిలిచేత్తో కాకిని కూడా తోలేవారు లేరు. ఎంత సంపాదించినా మనమే మింగేసి ఇంకాఇంకా బలిసిపోయి మళ్ళీ అది తగ్గించుకోడానికి వేరే అవస్థలుపడతామేగానీ "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అని గర్వంగా చెప్పుకోవడానికి మాత్రం ఇష్టపడం. ఏ స్కూలుకో, సేవాసంస్థకో ఓ వందరూపాయలు ఇవ్వాలంటే చేతులు రావుగానీ, భక్తిపేరుతో వేలకు వేలు గురువులకో, మఠాలకో సమర్పించుకోవడానికి లేదా నేనే భగవంతుడి అవతారమని ముస్తాబయ్యి పెద్ద కుర్చీలో కూర్చున్నవాడి పాదాల దగ్గర లక్షలు కుమ్మరించడానికి ఎలాంటి ఇబ్బందులు రావు. ఎంతమారత్వమో! కనీసం సహచర పాశ్చాత్యుల జీవన విలువల్ని కొద్దిమాత్రం ఆకళింపుచేసుకున్నా మనం మహానుభావులమనే అనుకోవాలి. తద్విరుద్ధంగా ఎదురువాళ్ళని కూడా కలుషితం చేసేస్తున్న దౌర్భాగ్యం మనది.

అందుకేనేమో శ్రీశ్రీ ఇలా వాపోయాడు – "మనదీ ఒక బతుకేనా? కుక్కలవలె, నక్కలవలె! మనదీ ఒకబతుకేనా? సందులలో పందులవలె!" ✦




# కలికాల మహిమ

– డా॥ బల్లూరి ఉమాదేవి, డల్లాస్

తే.గీ : నేను నాదను భావమ్ము నెక్కుడయ్యె
భార్య పిల్లలు దప్ప ప్రపంచ మింక
వలద టంచును తిరిగెడి వారి సంఖ్య
కలి యుగమ్మున పెరిగెను గాంచు డయ్య.

తే.గీ : కల్లలాడిన పాపము కలుగు ననెడి
భావ నమ్ము లెగిరి పోయె వసుధ యందు
న్యాయ వర్తనమను మాట లవని యందు
నెంత వెదకిన గనిపించవీ యుగాన.

తే.గీ : పెద్దలను గౌరవించెడు సుద్ది లేదు
నేనె గొప్పను భావన మెక్కుడయ్యె
నర్ధనగ్నముగ తిరుగ నదియె ఫ్యాష
ననుచు స్వేచ్ఛగా చరియింతు రవని యందు.

ఆ.వె : బంధు మిత్రులన్న వరుసలు కనరావు
స్వార్ధ మధిక మయ్యె జనుల యందు
ధనమె మూలమయ్యె ధరణిలో నంతట
పెద్ద లన్న లేదు ప్రేమ లిపుడు.

ఆ.వె : కన్నవారి కలలు కల్లలు గాచేసి
గెంటి వేసి వారి నింటి నుండి
మేమె గొప్ప యనుచు మేదిని యందున
తిరుగు వారి సంఖ్య పెరిగి పోయె.

ఆ.వె : కన్నవారె యిపుడు కానివారైరిల
భ్రమల మునిగి తాము బ్రతుకు చుండి
నిదియె సత్యమనుచు నెంచుచు మదిలోన
గడుపు చుందురెల్ల కాలమిటులె.

Active minds
ENVISION ★ EXPLORE ★ EXCEL
After School Care and Summer Camp Center
512 456 9999
info@activemindsusa.com
activemindsusa.com

# భారతీయ సంస్కృతి

గంగుల శ్రీహరి

భారతీయ సంస్కృతి...పాశ్చాత్య సంస్కృతులు ఇంకా పురుడు పోసుకోక ముందే సకల శాస్త్రాలతో వర్ధిల్లిన మహా సంస్కృతి. ఇతర మానవ జాతులు ఆహార సంపాదనే ధ్యేయంగా బ్రతుకుతున్న అనాగరిక కాలంలో భరత జాతి నాగరికత నేర్చింది. ప్రపంచానికి నాగరికత నేర్పింది. ఇతర సంస్కృతులకు అక్షరజ్ఞానం లేని కాలంలో భాషా పాండిత్యంతో వెలుగొందింది. ప్రపంచం ఆటవిక న్యాయంతో బ్రతికిన కాలంలో "లోకాసమస్తా సుఖినోభవంతు" అని నినదించింది. పాశ్చాత్యులు బ్రతుకే ఒక పోరాటంగా కొట్టుమిట్టాడుతున్న కాలంలో మన జాతి తర్క, న్యాయ, మీమాంస, గణిత, ఖగోళ, భాషాశాస్త్రాలు, నృత్య, శిల్ప, చిత్రకళలతో విలసిల్లింది. నిత్యం తెగల మధ్య పోరాటాలు జరుగుతున్న అజ్ఞాన యుగంలో "ఓం శాంతిః శాంతిః శాంతిః" అని శాంతి పాఠాలను వల్లెవేసింది. అన్నిటినీ మించి మరే ఇతర సంస్కృతిలోనూ లేని "ధర్మం" మరియు ధర్మబద్ధమైన జీవితాన్ని మనకి ప్రసాదించింది.

ఇన్ని ప్రత్యేకతలు కలిగిన భారతీయ సంస్కృతిని ఈనాడు అదే సంస్కృతిలో బతుకుతున్న కొంతమంది విమర్శించడం ఎంత అజ్ఞానం! ఈ రోజున భారతీయులు వెనుకబడినవారుగా, భారతదేశం వెనుకబడిన దేశంగా ఉండిపోవడానికి కారణం మన అజ్ఞానమే. ఆర్థికంగా అభివృద్ధిచెంది, మనకంటే విలాస జీవితాన్ని గడుపుతున్నంత మాత్రాన పాశ్చాత్యులను, పాశ్చాత్య దేశాలను గొప్పగా ఊహించుకుని, వారినే నాగరికులుగా, వారిదే అసలైన నాగరికతగా భ్రమించి, మన పరిణతి చెందిన నాగరికతని చిన్న చూపు చూసి, మన సనాతనధర్మం ప్రసాదించిన ధర్మబద్ధమైన జీవితాన్ని విడిచి, వారిని అనుకరించడమే మన ఈ వెనుకబాటుకు కారణం. ఒకనాడు ప్రపంచ దేశాలు సమస్తం భారతదేశానికి వలసమార్గం పట్టడం చరిత్ర చెబుతున్న నిజం. కారణం ఇది జ్ఞాన మరియు ఆర్థిక సంపన్న దేశం కావడమే. వలస వచ్చిన సంస్కృతులు ఇక్కడి నుండి జ్ఞానాన్ని పొంది, సంపదను పొంది, అభివృద్ధి చెంది, వారి అజ్ఞానాన్ని ఇక్కడ ప్రజలపై రుద్ది, ఇప్పుడు వారే అసలైన నాగరికులుగా, భారతీయులు అనాగరికులుగా ప్రచారంచేసినంత మాత్రాన మన సంస్కృతికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. కానీ మనమే ఆ ప్రచారానికి ప్రభావితమై, మనమే ప్రచారకులుగా మారడం, ముఖ్యంగా యువత ఆ మార్గాన్ని పట్టడం ఆందోళనకరం. ఈరోజున సనాతనధర్మానికి అర్థాన్ని వెతికోవాల్సిన దుస్థితిలో భారతీయ యువత నిలబడడం శోచనీయం. ✦

Best in Class™
Education Center
Math & English Enrichment
Call today for information!
University Blvd Center
Round Rock , TX
(512) 520–2521
bestinclasseducation.com

# వైకుంఠ పాళీ

(ఉట్టికెక్కలేని నేను స్వర్గానికెక్కేనా)

- వెంకట నక్షత్రరాజు

అహం చంపుకోని నేను,
"అహం బ్రహ్మోస్మి" అనగలనా!
కామం  అణచుకోని నేను,
ముక్తి ధామం కనగలనా!
క్రోధం ఆపుకోలేని నేను,
మోక్ష సౌధం పొందగలనా!
మోహ ఛాయలు వీడని నేను,
"సోహం"  భావ భవనమందగలనా!
లోభ ప్రవృత్తి  క్షోభ పెడుతూంటే,
భూనభోంతర శోభ నెలా జూడగలను!
నారీ స్తనభర నాభీ ఊబిలో దూరి,
నాకలోకపు వాకిళ్ల నెలా తాకగలను!
ఈర్ష్యాసూయల ఈటెలు నాటుతూ,
ఈశ్వర ప్రాసాదానికెలా ప్రాక గలను?
ఆశా ద్వేష పాశాలకు బందీనై,
విశ్వేశ్వర పాద స్పర్శ నెలా పొందగలను!

హీనుడను, దీనుడను, పరాధీనుడను,
అరిషడ్వర్గాలకు
బానిసు
డను,
ఆసురభావావేశ మానసుడను,
కార్పణ్య దోషోపహత చేతసుడను!

ఐనా – ఏది ఏమైనా – ఎలాగైనా,

వినాయకుని ప్రార్థించి,
విఘ్నేశుని పూజించి,
విఘ్నరాజుని  ధ్యానించి,
యత్నిస్తా, ప్రయత్నిస్తా, పరితపిస్తా!

అగజానన పద్మార్కుని
–కరుణా దృక్కులతో,
ఆ గజానన దయా కటాక్ష
–వీక్షణ దాక్షిణ్యంతో,
అసాధ్యమైనా సాధిస్తా,
అభేద్యమైనా భేదిస్తా,
అగమ్యమైనా గమిస్తా,
అకుంఠితంగా పురోగమిస్తా!
ఆరు భీకర శత్రుమూకల జయిస్తా,
నా ఇంద్రియ రాజ్యాన్ని శాసిస్తా, పరిపాలిస్తా !

– (నాకు నేనే) రాజుని






*With*
*Best Compliments From :*



**Pravardhan**
**Chimmula**
***Family***

SAM BASS FAMILY DENTISTRY

**Rupa Govindarajan, DMD**

2000 Sam Bass Road, Suite 108
Round Rock, Texas - 78681
**512-341-3200** **www.sambassdental.com**

# గరిక

- లక్ష్మణ్ కాపర్తి

గరిక నా అమెరికా ఇంటి రవిక
నీవు పెరిగితే కోయాలి, నీవు ఆగితే ఎరువేయ్యాలి
నీవు పెరగలేదు అంటే తంటా
మరెక్కువ పెరిగితే ఉంటుంది ఫైన్ల మంట
దుర్వా అంటూ బెర్ముడా అంటూ పిలిచేమంట

వృక్షజాతియందు మరిగ్గుజ్జు వృక్షము నీవు
వృక్ష జాతియందు ఫోనిక్స్ నీవు
భూమి సారమూ రక్షించే వరము నీవు
ఘనకీర్తి గరికపాటి ఇంటిపేరు నీవు

గణపయ్య పూజలో గణము నీవు
అమృత భాండము నీమీద మోసినావు
గ్రహణమందు జనులకి ఘనము నీవు
గట్టు మీద గడ్డి, చేనులో కలుపంటూ
ముద్దనుచు వద్దనుచు మనిషి తీరు

## నమ్మకం

చదవడానికి మూడు అక్షరాలు మాత్రమే
కానీ అది సంపాదించడం చాలా కష్టం
ఎందుకంటే అది డబ్బుకంటే విలువైనది.

## స్నేహం

వినడానికి ఒక్క క్షణం చాలు
కానీ మంచి స్నేహం దొరకాలంటే
ఒక యుగం పడుతుంది.

## ప్రేమ

ఇది వినడానికి బాగానే ఉంటుంది
కానీ అందరి దగ్గర దొరకదు
కొంతమంది దగ్గర మాత్రమే దొరుకుతుంది.


*With Best Compliments From :*





**Dr. Praveen Sampath**
*Family*

## TCA - చిత్రాలు




Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం
ఉగాది మరియు


Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం


Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం




Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం


Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం


Telugu Cultural Association,














Austin Table Tennis A


Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం
SPORTS MEET
Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం











# తెలుగు సాంస్కృతిక సంఘం, ఆస్టిన్

















Telugu Cultural
ssociation, Austin


Telugu Cultural Association, Austin


Telugu Cultural Association, Austin


Calvin Klein


With
Best Compliments
From
TRUSTED
REALTY
Trusted Name in Real Estate
BOBBY MATHEW, CNE
REAL ESTATE | PROPERTY MANAGEMENT
512 - 387 - 6869
MATH
ENGLISH
BEST
BRAINS
LEARNING CENTERS
ABACUS
G.K.
PUBLIC SPEAKING
STAAR TEST
Perform better in school this year with Best Brains!
✓ Real Classroom Teaching
✓ Direct Instructions
✓ Certified teachers
✓ Non-Repetitious Program
✓ Low student/teacher ratio
$89 One Subject
$169 Two Subjects
$189 Three or Four Subjects
per month
Austin-Great Hills, TX
12636 Research Blvd Ste C#108
Ph: 512-387-0000
Leander, TX
15609 Ronald Reagan Blvd, D140
Ph: 512-387-0000
Round Rock, TX
2681 Gattis School Road Suite 130
Ph: 512-489-0000